SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 | సంచిక : 217 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 16 ఏప్రిల్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5

## పోలీసింగ్‌లో తెలంగాణ నంబర్ వన్

- 'ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025' వెల్లడి
- నాలుగు అంశాలపై అధ్యయనం
- మొత్తంగా రాష్ట్రానికి మూడో ర్యాంకు

**సమయం న్యూస్, హైదరాబాద్:** పోలీసు శాఖ పనితీరులో దేశంలోనే తెలంగాణ మొదటిస్థానం సాధించింది. ప్రజలకు న్యాయం అందించే విషయంలో కోటి కంటే ఎక్కువ జనాభా ఉన్న 18 రాష్ట్రాలతో పోల్చినప్పుడు ఈ ఘనత సాధించింది. ఈ మేరకు 'ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025' పేరుతో టాటా ట్రస్ట్ మంగళవారం నివేదిక విడుదల చేసింది. ప్రజలకు న్యాయం అందించే పోలీసులు, న్యాయస్థానాలు, జైళ్లు, న్యాయసహాయం(లీగల్ ఎయిడ్) వంటి విభాగాల పనితీరును అధ్యయనం చేసిన టాటా ట్రస్ట్ 2019 నుంచి రాష్ట్రాలకు ర్యాంకింగ్‌లు ఇస్తోంది. సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్ కాజ్, కామన్‌వెల్త్

తరువాయి 2లో





## కాంగ్రెస్, భారాసలకు బిగ్‌బాస్ ఒవైసీనే

- కాంగ్రెస్ సర్కారును కూల్చే ఉద్దేశం మాకు లేదు
- ఎప్పుడు ఎన్నికలు వచ్చినా భాజపాదే విజయం
- పార్టీ జాతీయ అధ్యక్షుడి పోటీలో లేను
- విలేకరులతో ఇష్టాగోష్ఠిలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**సమయం న్యూస్, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం తమకు లేదని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారం తమదేనని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కిషన్‌రెడ్డి భాజపా రాష్ట్ర

తరువాయి 2లో

# గీత దాటితే వేటే

- నేను, మంత్రులు కూడా పార్టీ ఆదేశాల మేరకే పనిచేస్తాం
- మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయం రిజర్వు చేసింది
- జూన్ 2 వరకూ విస్తృతంగా గ్రామాల్లో తిరగాలి
- మే 1 నుంచి జూన్ 2 వరకూ నియోజకవర్గాల్లో పర్యటిస్తా
- కంచ గచ్చిబౌలి భూములపై భారాస, భాజపా ఏకమై దుష్ప్రచారం
- వచ్చే నెల నుంచి కొత్త ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో



## 10 లక్షల జనాభాకు 15 మందే న్యాయమూర్తులు

- 50 మంది ఉండాలన్న సూచనకు దూరంగా వాస్తవ పరిస్థితి
- దేశంలో న్యాయవ్యవస్థ తీరిదీ

**సమయం న్యూస్, దిల్లీ:** దేశంలో ప్రతి పది లక్షల జనాభాకు 15 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారని భారత న్యాయవ్యవస్థపై విడుదలైన ఒక నివేదిక వెల్లడించింది. అదే అమెరికాలో ప్రతి 10 లక్షల మంది పౌరులకు 150

తరువాయి 2లో





## అమరావతి, గుంటూరు, విజయవాడ కలిపి మెగాసిటీ

- మంగళగిరి, తాడేపల్లి కూడా అందులో భాగమే
- సీఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్
- దీని కోసం అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం
- మరోసారి భూసమీకరణ, సేకరణ అనేది నిర్ణయించలేదు
- రైతులు సమీకరణే కోరుకుంటున్నారు
- పురపాలకశాఖ మంత్రి నారాయణ

2లో

## మే 15 నుంచి సరస్వతి నది పుష్కరాలు

- కాళేశ్వరంలో 17 అడుగుల సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ: మంత్రి సురేఖ

**సమయం న్యూస్, హైదరాబాద్:** తెలంగాణలో సరస్వతి నది పుష్కరాలు మే 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరిగే పుష్కరాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని భక్తులకు అందించేందుకు వెబ్ పోర్టల్, యాప్‌ను ఇప్పటికే రూపొందించింది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పోర్టల్, యాప్‌ను మంగళవారమిక్కడ సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, పుణ్య స్నానాలకు రోజుకు 50 వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు వస్తారని అంచనా

తరువాయి 2లో




## క్రీడాకారులకు పుల్లెల గోపీచంద్ అభినందనలు



3లో

## రాజకీయ సంస్థగా పరిగణిస్తాం..

- 'హార్వర్డ్'కు ట్రంప్ హెచ్చరిక

2లో

## ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్



- రెండు, మూడు రోజుల్లోనే జారీ
- ముసాయిదా ఆర్డినెన్స్‌కు మంత్రివర్గం ఆమోదం
- డీఎస్సీ నుంచే వర్గీకరణ అమల్లోకి
- 26న మత్స్యకారులకు రూ.20 వేల ఆర్థిక సాయం విడుదల
- వెలిగొండ 2, 4 ప్యాకేజీ పనుల పూర్తికి నిధుల కేటాయింపు
- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు
- మే 2న ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం

2లో

## మద్యం కుంభకోణం సొత్తుతో 'స్పై' సినిమా

- నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా నిర్మించిన రాజ్ కసిరెడ్డి
- పాన్ ఇండియా మూవీగా నిర్మాణం
- నల్లధనాన్ని వైట్‌లోకి మార్చుకునేందుకే!
- పలువురు డైరెక్టర్లు, రచయితలకూ అడ్వాన్సులు
- జగన్ అధికారం కోల్పోవడంతో ఆగిపోయిన కొత్త ప్రాజెక్టులు

2లో

# గీత దాటితే వేటే...

హైదరాబాద్: పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా బహిరంగంగా ఎవరైనా మాట్లాడితే వేటు తప్పదని, కాంగ్రెస్‌ను నష్టపరిచిన తరువాత వ్యక్తులుగా నిలబడేవారికి ఎలాంటి ప్రయోజనం ఉండదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాను, మంత్రులు కూడా పార్టీ ఆదేశాల మేరకే పనిచేస్తున్నామని తెలిపారు. శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) అంతర్గత సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ''మంత్రివర్గ విస్తరణ అంశం నా పరిధి, పీసీసీ పరిధి దాటిపోయింది. మా అభిప్రాయాలు పార్టీ పెద్దలకు చెప్పాం. ఎవరికి మంత్రి పదవులివ్వాలి, ఎప్పుడు ఇవ్వాలనే నిర్ణయాన్ని అధిష్ఠానం ఇప్పటికే రిజర్వు చేసి పెట్టింది. పదవుల విషయంలో ఎవరికైనా భిన్నాభిప్రాయాలుంటే పార్టీ అంతర్గత సమావేశాల్లో చెప్పాలి. బహిరంగంగా విమర్శించడం వల్ల ఎవరికి నష్టం అనేది ఆలోచించాలి. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. అందరూ సంయమనం పాటించాలి. ఎన్నోసార్లు పార్టీ పరంగా అవకాశాలు వచ్చి త్రుటిలో జారిపోయినా.. గీత దాటకుండా పనిచేయడంతో ఇప్పుడు ఎమ్మెల్సీగా ఎన్నికైన అద్దంకి దయాకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి.

*** అవాస్తవ ప్రచారాన్ని తిప్పికొట్టాలి**

ప్రతిపక్షాలు అవాస్తవాలతో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం చేస్తుంటే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎందుకు తిప్పికొట్టడం లేదు? అసత్య ప్రచారాన్ని ఎక్కడికక్కడ ఖండించండి. ఆధారాలతో సహా వివరాలు బయటపెట్టండి.

*** విజయాలపై విస్తృత ప్రచారం చేయండి**

ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. సన్నబియ్యం పథకం ఒక అద్భుతం. ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం ప్రజలకు శాశ్వతంగా గుర్తుంటుంది. కేసీఆర్ ఓటమికి ధరణి లోపాలు కూడా ఒక కారణం. వాటన్నిటినీ సవరించి.. మనం అమలు చేస్తున్న భూ భారతి రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దేశంలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం ఆదర్శంగా నిలిచింది. కులగణన ద్వారా వందేళ్ల సమస్యను పకడ్బందీగా పరిష్కరించాం. ఇది మోదీ పాలనకు మరణశాసనంలా మారనుంది. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చాం. ఇది కాంగ్రెస్ పారదర్శక పాలనకు నిదర్శనం. జటిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం. ఎస్సీ వర్గీకరణపై జీవో జారీ అయినందున వచ్చే నెల నుంచి కొత్త ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ల జారీ ప్రారంభమవుతుంది. ఈ విజయాలన్నిటిపై జూన్ 2 వరకూ ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరిగి విస్తృతంగా ప్రచారం చేయాలి. ఏయే కార్యక్రమాలు చేపట్టాలనేది పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచిస్తారు.

*** ఏఐతో దుష్ప్రచారం.. మోదీ కూడా నమ్మారు**

జపాన్ పర్యటన ముగిసిన తర్వాత.. మే నెల ఒకటి నుంచి జూన్ 2 వరకూ నేను కూడా అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తాను. ఏ నియోజకవర్గంలో.. ఏ సమావేశంలో పాల్గొనాలో ఎమ్మెల్యేలే ముందుగా చెబితే అక్కడికి వస్తాను. వచ్చే నెల ఒకటి నుంచి ప్రతి ఎమ్మెల్యేను వ్యక్తిగతంగా కలిసి మాట్లాడతాను. మరోసారి మీ నియోజకవర్గంలో గెలవడానికి ఏయే అభివృద్ధి పనులు చేయాలో వివరాలు సేకరించండి. వాటిని పూర్తిచేయడానికి నిధులు మంజూరు చేయిస్తాను. కంచ గచ్చిబౌలి భూముల్లో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని యోచించాం. ఈ భూములపై ప్రభుత్వానికి ఆదాయం వస్తే సంక్షేమ పథకాల అమలుతో కాంగ్రెస్‌కు మంచిపేరు వస్తుందని భారాస, భాజపా ఏకమై దుష్ప్రచారం చేస్తున్నాయి. ఈ భూముల అమ్మకాలు ఆగిపోయేలా చూడాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. హోంమంత్రి అమిత్‌షాకు చెప్పారు. ఈ భూముల్లో వన్యప్రాణులున్నట్లు ఏఐ టెక్నాలజీతో బోగస్ చిత్రాలు, వీడియోలను ప్రతిపక్షాలు సృష్టిస్తే వాటిని మోదీ కూడా నమ్మారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ వద్ద ఉన్న 2300 ఎకరాల్లో 400 ఎకరాలు ప్రభుత్వానివే. ఈ భూములపై ఆదాయం రాకుండా భాజపా, భారాస అడ్డుకుంటున్నాయి'' అని సీఎం చెప్పినట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి దశ కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల్లో పునాదుల వరకు పనులు పూర్తిచేసిన 12 మందికి మొదటి విడతగా రూ.లక్ష విలువైన చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా అందజేశారు. ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తన నెలవారీ వేతనం నుంచి రూ.20 వేలు పార్టీకి, సీఎల్పీకి ఇవ్వాలని పీసీసీ ఈ సందర్భంగా నిర్ణయించింది.

## అమరావతి, గుంటూరు, విజయవాడ కలిపి మెగాసిటీ

అమరావతి, తుళ్లూరు: భవిష్యత్తులో అమరావతి, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ అన్నీ కలిపి మెగాసిటీగా సీఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్ రూపొందించారని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. మెగాసిటీకి ఒక అంతర్జాతీయ విమానాశ్రయం అవసరమన్నారు. దాని నిర్మాణానికి 5 వేల ఎకరాలు కావాలని, ఆ మేరకు భూమి పరిశీలించాలని చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. రాజధాని నిర్మాణ పనులకు కావాల్సిన గ్రావెల్ కోసం మంగళవారం అమరావతిలోని అనంతవరం గ్రామ కొండలను పరిశీలించిన అనంతరం నారాయణ మాట్లాడారు. 'రాజధాని అమరావతి కోసం మరోసారి సేకరించే భూమిని భూసేకరణ ద్వారా తీసుకోవాలా? భూసమీకరణ ద్వారా తీసుకోవాలా అనేది ఇంకా నిర్ణయించలేదు. భూసేకరణ ద్వారా 5 వేల ఎకరాలు తీసుకోవచ్చు. కాని సేకరణ ద్వారా భూములు తీసుకుంటే రైతులు నష్టపోతారని స్థానిక ఎమ్మెల్యేలు నా దృష్టికి తీసుకొచ్చారు. భూసేకరణ ద్వారా భూములు తీసుకుంటే రిజిస్ట్రేషన్ ధర కంటే రెండున్నర రెట్లు మాత్రమే ఎక్కువ వస్తుంది. సమీకరణ ద్వారా అయితే రైతులకు ప్రయోజనం ఉంటుంది. అందుకే వారు అదే కోరుకుంటున్నారు. భూసమీకరణలో 5 వేల ఎకరాలు కావాలంటే.. సుమారు 30 వేల ఎకరాల్ని తీసుకోవాలి. దీనిలో రోడ్లు, రైతులకు రిటర్నబుల్ ప్లాట్లకు లేఅవుట్లు వేసి, డ్రెయిన్లు కట్టాల్సి ఉంటుంది' అని వివరించారు.

**హైదరాబాద్‌లో నిర్మించినప్పుడూ విమర్శించారు**

'ముఖ్యమంత్రి చంద్రబాబు హైదరాబాద్‌లో విమానాశ్రయం నిర్మించినప్పుడు కూడా అంత భూమి ఎందుకని చాలామంది విమర్శించారు. కాని ఈ రోజు అది ఉత్తమ విమానాశ్రయాల్లో ఒకటి. చంద్రబాబు రాబోయే వందేళ్ల గురించి ఆలోచిస్తారు. విమానాశ్రయంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో క్రీడానగరాన్ని నిర్మించాలనే ఆలోచనా ఉంది. దీనిని నిర్మిస్తే.. దేశవిదేశాల నుంచి క్రీడాకారులు, అభిమానులు వస్తారు. వారి వసతి కోసం హోటళ్లు ఏర్పాటవుతాయి. ఇలా ఆర్థిక కార్యాకలాపాలు అభివృద్ధి చెందుతాయి. నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. దానిని దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్నాం' అని మంత్రి నారాయణ చెప్పారు.

**గ్రావెల్ కోసం 851 ఎకరాల కేటాయింపు**

'అమరావతిలో నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్, కంకర సరఫరా చేయటానికి గనులశాఖ 5 జిల్లాల్లో 851 ఎకరాలను సీఆర్‌డీఏకు కేటాయించింది. వీటిలో ఏలూరు జిల్లాలో 355, కృష్ణాలో 428, పల్నాడులో 28, గుంటూరులో 21, ఎన్టీఆర్ జిల్లాలో 18 ఎకరాలు ఉన్నాయి. రాజధాని గ్రామం అనంతవరంలోని కొండ ప్రాంతాన్ని 201419లోనే సీఆర్‌డీఏకు ఇచ్చారు. వాటిలో గ్రౌండ్ లెవల్ కంటే 6 నుంచి 8 మీటర్ల లోతు వరకు భూమిని తవ్వారు. ఆ ప్రాంతాన్ని మొత్తం డ్రోన్లతో సర్వే చేయిస్తాం. అధికారులతో చర్చించిన అనంతరం గోతులు పూడ్చుతాం. ఆ భూమిని కూడా ఏదో ఒక అవసరాలకు వినియోగించాలనే ఉద్దేశంతోనే అనంతవరం వచ్చా' అని తెలిపారు.

**ఏడాదిలో అధికారుల భవనాలు పూర్తి**

'రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు అపోహపడాల్సిన పనేం లేదు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లాన్‌తో మూడేళ్లలో అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. అధికారుల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఏడాదిలోపు పూర్తి చేస్తాం. ఏడాదిన్నరలో అమరావతిలో సుమారు 360 కి.మీ. ట్రంక్ రోడ్లు నిర్మిస్తాం. రెండున్నరేళ్లలో రైతుల రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్లలోని రోడ్లు, మూడేళ్లలో ఐకానిక్ టవర్లు నిర్మిస్తాం. ఇప్పటికే అమరావతి పునర్నిర్మాణానికి అవసరమైన 68 పనులకు సంబంధించి రూ.42,360 కోట్ల విలువైన టెండర్లు పూర్తి చేశాం. రాజధానిలో రూ.64,912 కోట్లతో మొత్తం 92 పనులు చేపడతాం' అని మంత్రి నారాయణ వివరించారు. 'గత వైకాపా ప్రభుత్వం రాజధానిని కట్టనప్పుడు 201419 వరకు ఇచ్చిన టెండర్లను రద్దు చేసినా బాగుండేది. వాటికి డబ్బులు చెల్లించకుండా అలాగే ఉంచడంతో న్యాయపరమైన సమస్యలు తలెత్తాయి. వాటిని పరిష్కరించడానికి 7, 8 నెలలు పట్టింది. మళ్లీ టెండర్లు పిలిచాం' అని చెప్పారు.

## రాజకీయ సంస్థగా పరిగణిస్తాం..

ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీకి అందించే ఫెడరల్ నిధులను స్తంభింపజేయాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే హార్వర్డ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కన్నెర్ర చేశారు. రాజకీయ, సైద్ధాంతిక, ఉగ్రవాద ప్రేరేపిత వైఖరిని ఇలాగే కొనసాగిస్తే.. పన్ను మినహాయింపు హోదా కోల్పోవచ్చని 'ట్రూత్ సోషల్' వేదికగా స్పష్టం చేశారు.

## మే 15 నుంచి సరస్వతి నది పుష్కరాలు

(మొదటిపేజీ తరువాయి)

వేస్తున్నట్లు తెలిపారు. 'పుష్కరాలను పురస్కరించుకుని కాళేశ్వరంలో 17 అడుగుల రాతి సరస్వతి విగ్రహం ఏర్పాటుచేస్తున్నాం. భక్తుల సౌకర్యార్థం సుమారు రూ.35 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం. 100 గదుల వసతి గృహం, డార్మిటరీ భవనాన్ని అందుబాటులోకి తెచ్చాం' అని తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నంబరు ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే సరస్వతి నది పుష్కరాలు జరిగాయని, ప్రస్తుతం పుష్కరాలు నిర్వహించే భాగ్యమూ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ధార్మిక పరిషత్ సలహాదారు గోవింద హరి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

**పుష్కర సాన్నాలకు పీఠాధిపతులు**

పలు రాష్ట్రాల్లోని పీఠాధిపతులు పుష్కర స్నానమాచరిస్తారని దేవాదాయశాఖ తెలిపింది. మే 15న మెదక్ జిల్లా రంగంపేటలోని శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠానికి చెందిన మాధవానంద సరస్వతిస్వామి పుష్కరాలను ప్రారంభిస్తారు. 17న తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి, 18న పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి, 19న నాసిక్ త్రయంబకేశ్వర్‌లోని మహామండలేశ్వర్ ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్, 23న హంపి విరుపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి పుష్కరస్నానం ఆచరిస్తారు.

## ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్

రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలన్నింటికీ విద్య, ఉద్యోగాల్లో సమాన, న్యాయమైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా.. ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఈ ప్రక్రియలో అతి ముఖ్యమైన ముసాయిదా ఆర్డినెన్స్‌కు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రెండు, మూడు రోజుల్లో ఆర్డినెన్స్ జారీ కానుంది. ఆ వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకానికి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానుంది. 45 రోజుల సమయమిచ్చి కొత్త విద్యాసంవత్సరం నాటికే డీఎస్సీ నిర్వహణ పూర్తి చేసి వర్గీకరణ ఫలాలు అందించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే రూ.20 వేల ఆర్థికసాయాన్ని ఈ నెల 26న విడుదల చేయాలని నిర్ణయించింది. అదే రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక మత్స్యకార గ్రామాన్ని సందర్శించి, ఈ సాయాన్ని విడుదల చేయనున్నారు. మే 2న రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల్ని ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. పీ4ను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంతో మమేకమయ్యేలా మంత్రివర్గ భేటీలో సీఎం దిశానిర్దేశం చేశారు. 2047 విజన్‌లో భాగంగా తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలిపేందుకు పొలిటికల్ గవర్నెన్స్, సోషల్ ఇంజినీరింగ్‌పైనా చర్చించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశం వివరాలను మంత్రులు నిమ్మల రామానాయుడు, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, అనిత, కందుల దుర్గేశ్ మీడియాకు వివరించారు.

## మద్యం కుంభకోణం సొత్తుతో 'స్పై' సినిమా

అమరావతి: వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో కీలక పాత్రధారి కసిరెడ్డి రాజశేఖరరెడ్డి (రాజ్ కసిరెడ్డి)..దోచుకున్న నల్లధనాన్ని వైట్‌లోకి మార్చుకునేందుకు సినిమాల నిర్మాణం చేపట్టారు. ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ అనే సంస్థను నెలకొల్పి.. నిఖిల్ సిద్ధార్థ్ (కార్తికేయ 2 ఫేమ్) హీరోగా 'స్పై' అనే పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మించారు. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో 2023 జూన్ 29న ఈ సినిమాను విడుదల చేశారు. దీనికి కథ కూడా రాజ్ కసిరెడ్డే సమకూర్చినట్లు టైటిల్స్‌లో వేసుకున్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ అదృశ్యం వెనకున్న రహస్యాన్ని స్పృశిస్తూ.. ఓ గూఢచారి ఇతివృత్తంతో రూపొందించిన ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమా ఫ్లాప్ అయ్యింది. ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థకు ఉప్పలపాటి చరణ్‌తేజ్ అనే ఓ డైరెక్టర్, రచయితను సీఈవోగా పెట్టుకున్నారు. ఒకేసారి భారీగా సినిమాలు నిర్మించడం కోసం పలువురు యువ డైరెక్టర్లు, రచయితలకూ అడ్వాన్సులిచ్చారు. ఆ మధ్యకాలంలో మిడ్ రేంజ్, కొత్త హీరోలతో హిట్ సినిమాలు తీసిన నలుగురైదుగురు డైరెక్టర్లతో కథలపై చర్చించి సినిమాల నిర్మాణానికి ప్రయత్నించారు. మద్యం కుంభకోణంలో సమకూరిన నగదును దీనిలోకి కుమ్మరించినట్లు సమాచారం. ఈ లోగా ఎన్నికలు ముంచుకొచ్చేయడం, ఏపీలో జగన్ అధికారం కోల్పోవడం, మద్యం కుంభకోణంపై దర్యాప్తు తీవ్రతరం కావడంతో.. ఆ కొత్త ప్రాజెక్టులన్నింటినీ నిలిపేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

**నిర్మాణానికి సొత్తు ఎక్కడిది?.. ఎలా చెల్లించారు?**

''స్పై'' సినిమాను ఎంత బడ్జెట్‌లో నిర్మించినట్లు చెప్పారు? దానికి వాస్తవంగా చేసిన వ్యయం ఎంత? ఈ సొత్తు ఎక్కడి నుంచి సమకూరింది? ఏయే రూపాల్లో చెల్లించారు? ఈ సినిమాకు జరిగిన వ్యాపారమెంత? తదితర వివరాలన్నీ ఇప్పటికే సిట్ సేకరించింది. కొంతమందికి నగదు రూపంలో చెల్లించినట్లు గుర్తించింది.

## పోలీసింగ్‌లో తెలంగాణ నంబర్ వన్

(మొదటిపేజీ తరువాయి)

హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్ తదితర సంస్థల సహకారంతో తాజా నివేదిక రూపొందించింది.

**నివేదికలోని ముఖ్యాంశాలు..**

తాజాగా వెల్లడించిన నాలుగో ఎడిషన్ ర్యాంకుల్లో దేశవ్యాప్తంగా పోలీసింగ్‌లో తొలిస్థానంలో నిలిచిన తెలంగాణ.. జ్యుడిషియరీలో 2.. జైళ్ల విభాగంలో 7.. లీగల్‌ఎయిడ్‌లో 10వ స్థానంలో.. 6.15 స్కోర్‌తో ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచింది. 6.78 స్కోర్‌తో కర్ణాటక మొదటి స్థానం సాధించింది. 2019లో వెలువడిన మొదటి ఎడిషన్‌లో ఓవరాల్ ర్యాంకుల్లో 11వ స్థానంలో ఉన్న తెలంగాణ.. 2020, 2022లలో మూడో స్థానంలో నిలిచింది. ఈసారీ అదే స్థానాన్ని నిలబెట్టుకుంది. కానిస్టేబుళ్ల స్థాయిలో రాష్ట్రంలో 13% మాత్రమే ఖాళీలున్నాయి. ఇది జాతీయ సగటు కంటే చాలా తక్కువ. తెలంగాణ పోలీసుశాఖలో కేవలం 9% మంది మాత్రమే మహిళా పోలీసులు ఉన్నారు. ఇదీ జాతీయ సగటు కంటే చాలా తక్కువ. తెలంగాణలో పట్టణ ప్రాంతాల్లో ప్రతి 10.6 చదరపు కిలోమీటర్లకు.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 282 చదరపు కిలోమీటర్లకు ఒకటి చొప్పున పోలీస్ స్టేషన్ ఉంది. అతి తక్కువ పరిధిలో పోలీస్ స్టేషన్లు ఉన్న రాష్ట్రాల్లో దేశంలోనే తెలంగాణ మొదటిస్థానంలో ఉంది. తెలంగాణలోని 85 శాతం పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు, మహిళా సహాయ డెస్కులున్నాయి. మహిళా జడ్జిల్లో మొదటిస్థానం తెలంగాణ జిల్లా కోర్టుల్లో 21%.. హైకోర్టు జడ్జిల్లో 29%.. సిబ్బందిలో 24% ఖాళీలున్నాయి. దేశంలోనే అత్యధికంగా తెలంగాణ హైకోర్టులో 33%, జిల్లా కోర్టుల్లో 55%మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు.

**జైళ్లలో 59 శాతం వైద్యుల్లేరు..**

తెలంగాణ జైళ్లలో 59 శాతం వైద్యులు అందుబాటులో లేరు. 202223 నాటి లెక్కల ప్రకారం రాష్ట్రంలోని జైళ్లలో 6,500 మంది ఖైదీలుండగా.. ఒక్కొక్కరిపై ఏడాదికి రూ.33,277 చొప్పున ఖర్చు పెట్టారు. ప్రజలకు అవసరమైన న్యాయసహాయం అందించే లీగల్ సర్వీస్ క్లినిక్‌లో తెలంగాణలో 440 గ్రామాలకొకటి మాత్రమే ఉంది. మొత్తం లీగల్ ఎయిడ్ బడ్జెట్‌లో 80 శాతాన్ని కేటాయించిన రాష్ట్రం.. 2022..23 సంవత్సరంలో పూర్తి నిధుల్ని ఖర్చు చేసింది.

## కాంగ్రెస్, భారాసలకు బిగ్‌బాస్ ఒవైసీనే

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయంలో విలేకరులతో ఇష్టాగోష్ఠిలో పలు అంశాలు మాట్లాడారు. ''కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టే ఉద్దేశం భాజపాకు లేదు. సర్కారు పూర్తి కాలం కొనసాగాలనే మేం కోరుకుంటాం. ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా మారింది. సర్కారు కేవలం భూముల అమ్మకం, మద్యం విక్రయం, అప్పులపైనే ఆధారపడి పాలన కొనసాగిస్తోంది. కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ గెలవదు. విజయం భాజపాదే. రేవంత్‌రెడ్డిది యంగ్ ఇండియా బ్రాండ్ అయితే నాది నేషనలిజమ్ బ్రాండ్. ఎన్నికలు వస్తే రేవంత్‌ది ఏ బ్రాండో ప్రజలే తేలుస్తారు. కాంగ్రెస్, భారాస పార్టీలకు బిగ్‌బాస్ ఒవైసీనే. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో భాజపా, మజ్లిస్ మధ్యే పోటీ ఉంటుంది. మేం తప్పకుండా నెగ్గుతాం. హెచ్‌సీయూ విషయంలో నేను పెట్టిన పోస్టుకు కట్టుబడి ఉంటా. సామాజిక మాధ్యమంలో నేను పోస్టు చేసిన ఫొటో ఏఐది అయితే కావొచ్చు. అది హెచ్‌సీయూ ఫొటో అని నేను అందులో పేర్కొనలేదు. ఈ విషయంలో నాపై కేసు పెట్టినా సిద్ధం. హెచ్‌సీయూ భూముల్లో జింకలు, వన్యప్రాణులు ఉన్న మాట మాత్రం వాస్తవం. అర్ధరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టి చెట్లు నరకాల్సిన అవసరం ఏముంది? సొంత ఇంట్లో చెట్టు నరికినా అనుమతి తీసుకోవాలి. కానీ హెచ్‌సీయూలో అనుమతి లేకుండా నరికివేశారు. పర్యావరణ పరిరక్షణ చట్టం, అటవీ సంరక్షణ చట్టాలు ఉల్లంఘించారు. వక్ఫ్ సవరణ బిల్లుపై పార్లమెంటులో 26 గంటల పాటు చర్చ జరిగింది. అది ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన అంశమే. వక్ఫ్‌పై జరుగుతున్న ఆందోళనలు భూ కబ్జాదారులు చేస్తున్నవే. పేద ముస్లింలు ఆందోళనలో లేరు. ఈ సవరణ వల్ల పేద ముస్లింలకు ఎంతో మేలు జరుగుతుంది. వక్ఫ్‌పై ఏప్రిల్ 17 నుంచి మైనారిటీ ఔట్‌రీచ్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నాం. ప్రార్థనా స్థలాలకు, వక్ఫ్‌బోర్డుకు సంబంధం లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.1.5లక్షల కోట్లు కావాలని కేంద్రానికి లేఖలు రాశారు. అక్కడ మిగులు బడ్జెట్ లేదు. కేంద్రం కూడా అప్పుల్లో ఉంది. త్వరలో రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక పూర్తవుతుంది. నేను జాతీయ అధ్యక్షుడి పోటీలో లేను'' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## 10 లక్షల జనాభాకు 15 మందే న్యాయమూర్తులు

(మొదటిపేజీ తరువాయి)

మంది జడ్జీలు, ఐరోపాలో 220 మంది జడ్జీలు ఉన్నారని గతంలో విడుదలైన పలు నివేదికలు పేర్కొన్నాయి. 2019లో టాటా ట్రస్టు ఆధ్వర్యంలో ఈ అధ్యయనం మొదలుకాగా 'భారత న్యాయ నివేదిక 2025' పేరుతో నాలుగో ఎడిషన్ తాజాగా విడుదలైంది. సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్ కాజ్, కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనీషియేటివ్, దక్ష్, టిస్‌ప్రయాస్, విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ, హౌ ఇండియా లివ్స్ వంటి సంస్థలు ఈ అధ్యయనంలో పాలుపంచుకున్నాయి. ''దేశంలో 140 కోట్ల జనాభాకు 21,285 మంది జడ్జీలు మాత్రమే ఉన్నారు. అంటే ప్రతి 10 లక్షల మందికి 15 మంది న్యాయమూర్తులు. 1987లో ఏర్పాటైన న్యాయ కమిషన్ ఈ సంఖ్య 50గా ఉండాలని సూచించింది. 2025లో హైకోర్టుల్లో మొత్తం మంజూరు చేసిన పోస్టుల్లో 33 శాతం జడ్జి పోస్టులు ఖాళీగా ఉండగా, జిల్లా కోర్టుల్లో అది 21 శాతంగా ఉంది. జాతీయ స్థాయిలో చూస్తే జిల్లా కోర్టుల్లో ఒక్కో న్యాయమూర్తిపై 2,200 కేసుల పనిభారం ఉంది. అలహాబాద్, మధ్యప్రదేశ్ ఉన్నత న్యాయస్థానాల్లో ఒక్కో న్యాయమూర్తి 15,000 కేసులు వినాల్సిన పరిస్థితి ఉంది. కొన్ని కోర్టుల్లో కేసులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. జిల్లా కోర్టుల్లో మహిళా జడ్జీల ప్రాతినిధ్యం పెరిగింది. 2017లో వారి సంఖ్య 30 శాతం ఉండగా 2025లో 38.3 శాతానికి పెరిగింది. హైకోర్టుల్లో 11.4 శాతం నుంచి 14 శాతానికి చేరుకుంది. మొత్తంగా ప్రస్తుతం ఒక హైకోర్టులో మాత్రమే ప్రధాన న్యాయమూర్తిగా మహిళ ఉన్నారు'' అని నివేదిక పేర్కొంది. కులాల వారీగా న్యాయమూర్తుల సంఖ్యనూ ఈ నివేదిక వెల్లడించింది. జిల్లా న్యాయస్థానాల్లో 5 శాతం మంది ఎస్టీలు మాత్రమే జడ్జీలుగా ఉన్నారని, 14 శాతం మంది షెడ్యూలు కులాలవారు ఉన్నారని పేర్కొంది.

**మహిళా ఐపీఎస్‌ల సంఖ్య 960 మాత్రమే!**

దేశంలోని పోలీసు విభాగంలో డైరెక్టర్ జనరల్, ఎస్పీ హోదాలో పనిచేస్తున్న మహిళల సంఖ్య 960 మాత్రమేనని 'భారత న్యాయ నివేదిక 2025' వెల్లడించింది. చట్ట అమలులో లింగ వైవిధ్యం ఆవశ్యకతపై అవగాహన పెరుగుతున్నప్పటికీ ఒక్క రాష్ట్రం, ఒక్క కేంద్ర పాలిత ప్రాంతం కూడా పోలీసు దళంలో మహిళా ప్రాతినిధ్యం కోసం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేదని ఈ నివేదిక పేర్కొంది.

# క్రీడాకారులకు పుల్లెల గోపీచంద్ అభినందనలు

క్రీడా ప్రతినిధి, ఏప్రిల్ 15: క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సెక్రటరీ, భారత్ బ్యాట్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ మంగళవారం అభినందించారు. గచ్చిబౌలిలోని కొటక్ పుల్లెల గోపీచంద్ బ్యాట్మింటన్ అకాడమీలో గోవాలో జరిగిన నేషనల్ బ్యాట్మింటన్ టోర్నమెంట్ లో మెడల్స్ సాధించిన క్రీడాకారులను బ్యాట్ జాయింట్ సెక్రెటరీ యు వి ఎన్ బాబు, బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ కానూరు వంశీధర్ ఆధ్వర్యంలో క్రీడాకారులను



ఘనంగా సత్కరించి అభినందించారు. 35 ప్లస్ క్యాటగిరి ఎస్ అప్పారావు బ్రాంచ్ మెడల్ సాధించాడు. 35 ప్లస్ క్యాటగిరి ఉమెన్స్ డబుల్స్ లో ప్రభిను సిల్వర్ మరియు మిక్స్ డ్ డబుల్స్ లో బ్రాంజ్ మెడల్ సాధించారు. 55 ప్లస్ క్యాటగిరిలో మిక్స్ డబుల్స్ లో ఏం కమలాకర్ రావు బ్రాంజ్ మెడల్ సాధించాడు. 60 ప్లస్ కేటగిరి మెన్ డబుల్స్ లో ఏవీఎస్ మూర్తి గోల్డ్ మెడల్ 60 ప్లస్ సింగిల్స్ లో సిల్వర్, మిక్స్ డబుల్స్ లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. 75 ప్లస్ క్యాటగిరి సింగిల్స్ లో పి రాజలింగం బ్రాంచ్ మెడల్, మెన్స్ డబుల్స్ లో బ్రాంచ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ క్రీడా పోటీలు క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు పేరు ప్రఖ్యాతలు అందుతాయని తెలిపారు



## అనాధాల సేవలో VFO ఫౌండేషన్ టీమ్

అంబర్ పేట,ఏప్రిల్ 15, సమయం న్యూస్: అంబర్ పేట కు చెందిన నాయి బ్రాహ్మణ సోదరులు ఎప్పటిలాగే వారికి సెలవు రోజైన మంగళవారం నాడు సమాజ సేవలో భాగంగా హయత్ నగర్ డెక్కన్ బాయ్స్ అనాధాశ్రమం లో ఉన్న చిన్నారులకు ఉచితంగా హెయిర్ కటింగ్ చేశారు. వారు చేస్తున్న సేవను గుర్తించి స్థానికులు అభినందనలు తెలిపారు.వి ఫర్ ఆర్ఫన్ ఫౌండేషన్ VFO టీమ్ సభ్యులు అంబర్ పేట కొండూరు శ్రీకాంత్ నాయీ ,శంకర్ నాయి, పరుశురాం నాయి, ఇ .శ్రీకాంత్ నాయి ,రాకేశ్ చేర్యాల నాయి తదితరులు.



మేడ్చల్ నియోజకవర్గం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శిల్ప నగర్ లో శ్రీ వెంకట మారకత చంద్రమౌళిశ్వర హనుమాన్ దేవాలయ వార్షికోత్సవ కార్యక్రమంలో చామకుర మల్లారెడ్డి మాజీ మంత్రివర్యులు మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు . పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి దర్శనం చేసుకోవడం జరిగింది.

మేడ్చల్ మల్కాజ్‌గిరి. ఏప్రిల్ 16సమయం న్యూస్

# ఓపెన్ స్కూల్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

* **దూరవిద్య ద్వారా ఉపాధి అవకాశాలు**
* **కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్ ఏప్రిల్ 15 సమయం న్యూస్ : కరీంనగర్ జిల్లాలో ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న వారంతా శ్రద్ధతో చదివి నూరు శాతం ఫలితాలు సాధించాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆకాంక్షించారు. ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్, పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఏ చిన్న ఉద్యోగానికైనా, ఉపాధి అవకాశాలకైనా విద్యార్హతలు ముఖ్యమని అన్నారు. అందుకే జిల్లా యంత్రాంగం తరపున గత తొమ్మిది సంవత్సరాలుగా 10వ తరగతిలో ఫెయిల్ అయిన పలువురు విద్యార్థులను గుర్తించి గత ఏడాది పదవ తరగతి పరీక్ష రాయించిన విషయాన్ని గుర్తు చేశారు. వీరిలో 90 శాతం మంది ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువుల్లో చేరారని అన్నారు. అనారోగ్యం, వివాహం, కుటుంబ పరిస్థితులు వంటి వివిధ కారణాల చేత చాలామంది పాఠశాల విద్యను మధ్యలోనే ఆపేసిన వాళ్ళు ఉన్నారని, వారంతా ఓపెన్ స్కూల్లో చేరాలని సూచించారు. ఓపెన్ స్కూల్ విద్యార్హత రెగ్యులర్ అర్హతకు సమానమేనని అన్నారు. దూర విద్య ద్వారా ఉన్నత విద్య అభ్యసించి అనేకమంది ఉన్నత ఉద్యోగాలు సాధించిన వారు ఉన్నారని తెలిపారు. ఈనెల 20 నుండి



నిర్వహించనున్న ఇంటర్, పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఫీజు చెల్లించిన విద్యార్థులంతా తప్పక హాజరై పరీక్ష రాయాలని సూచించారు. పాస్ అయిన తర్వాత దూరవిద్యలో డిగ్రీలో చేరాలని సూచించారు. ఓపెన్ స్కూల్ తరగతులు గ్రంథాలయాల్లో నిర్వహించే అంశాన్ని పరిశీలించా లని విద్యాధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు మాట్లాడుతూ పదవ తరగతికి 421 మంది, ఇంటర్ కి 881 మంది ఓపెన్ స్కూల్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. చదువు మధ్యలో ఆపిన వాళ్ళు రానున్న విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ లో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సిహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నాం

: **బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు..**

**కుత్బుల్లాపూర్. ఏప్రిల్ 16 సమయం న్యూస్:** ఈరోజు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు మాట్లాడుతూ....నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతున్నామని, రానున్న రోజుల్లో కూడా ప్రతీ ఒక్కరికి అందుబా టులో ప్రజాసంక్షేమం ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు.

# దేశంలోనే ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన రాష్ట్రంగా తెలంగాణ రికార్డు

**చారిత్రాత్మక ఘట్టం..**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతోనే సాధ్యమైంది.**
**అంబేద్కర్ విజన్ ను నిజం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం..**
**30 ఏళ్ల కల సాకారం..**

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు.. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు కరీంనగర్ ఏప్రిల్ 15 సమయం న్యూస్ : భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మక ఘట్టమనీ కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. మంగళవారం వెలి



చాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాల 30 ఏళ్ల కల సాకారమైందని, ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న రాష్ట్రం గా దేశంలోనే తెలంగాణ రికార్డు సాధించిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు ప్రత్యేక కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, వైస్ చైర్మన్ దామోదర రాజనర్సింహ, మెంబర్ పొన్నం ప్రభాకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విజన్ ను నిజం చేస్తూ ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరిం చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలని, ప్రజల మధ్య సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు తొలగిపోవాలనే ఉద్దేశంతో అంబేద్కర్ లక్ష్యాన్ని కనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ ప్రక్రియను విజయవంతంగా చేపట్టిందని చెప్పారు. వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన 9 నెలల కాలంలోనే ఆ ప్రక్రియను చేపట్టి అసెంబ్లీలో తీర్మానం చేసి దానికి చట్టబద్ధత కూడా కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని పేర్కొన్నారు. అనంతరం వర్గీకరణ అమలుకు నాలుగు ఉత్తర్వులను సోమవారం విడుదల చేయడం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఆకాంక్ష నెరవేరిన సందర్భంగా దళితులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సమానత్వం సామాజిక న్యాయం కోసం జీవితాంతం పరితపించిన అంబేద్కర్ జయంతి రోజున వర్గీకరణ ఆకాంక్ష సంపూర్ణంగా నెరవేరడం ఆనందంగా ఉందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి విజన్, కమిట్మెంట్ వల్లే వర్గీకరణ ఆకాంక్ష ఇంత త్వరగా సాకారం అయిందని రాజేందర్ రావు తెలిపారు. వర్గీకరణ అమలుపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన కొద్ది గంటల్లోనే అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేశారని, ఆ మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం సాహసోపేత నిర్ణయం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కుల గణన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని, ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కూడా పరిష్కరించిందని చెప్పారు. ఈ రెండు కీలక నిర్ణయాలు అమలు చేయడం కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందనడానికి నిదర్శనమని వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు.




## వేసవి కాలంలో ఉచిత మజ్జిగ పంపిణీ...

మల్కాజిగిరి 15 (సమయం న్యూస్) : మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సహకారంతో కాంగ్రెస్ పార్టీ 140 డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వేసవికాలం సందర్భంగా డివిజన్ పరిధిలోనీ అన్ని ముఖ్యమైన ప్రాంతాలలో నెల రోజులపాటు ప్రజలకు ఆరోగ్యకరమైన మజ్జిగ పంపిణీ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగింది. ఈ వేసవి కాలంలో ఎంతోమంది దాహం తీర్చాలని ఉద్దేశంతో ఈరోజు మల్కాజిగిరి చౌరస్తాలో మజ్జిగ ( బట్టర్ మిల్క్) పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌసుదిన్ భాయ్,మొర శ్రీకాంత్ ముదిరాజ్,మల్లేష్ గౌడ్,శ్రీ శైలంముదిరాజ్ ,రాజు ,మురళి ,అ రుణ్,కార్తీక్,కిషోర్,ప్రవీణ్,మరియు కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

* **50 సంవత్సరాల తర్వాత అపూర్వ కలయిక**
* **ఆనందం వ్యక్తం చేసిన చిన్న నాటి స్నేహితులు**

వెల్దుర్తి సమయం , న్యూస్ ఏప్రిల్ 15 : ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఒకే పాఠశాలల్లో చదువుకున్నారు. ఎంతో ఆత్మీయంగా గడిపిన వారు వెల్దుర్తి మండలం జిల్లా పరిషత్ పాఠశాలలో 1975లో పదవ తరగతి అయిపోగానే ఉన్నత పాఠశాలలో చదువు కోసం వేరే వేరే ప్రాంతాలలోకి వెళ్లి విడిపోయారు. అయితే సంవత్సరాలు క్షణాల్లో గడిచిపోయాయి అందరూ జీవితాల్లో స్థిరపడ్డారు. తమ చిన్ననాటి స్నేహితులు ఎలా ఉన్నారు.. ఏమి చేస్తున్నారు.. తెలుసుకోవడానికి వాట్సప్ ప్రపంచం కొంతమందిని దగ్గరికి చేర్చింది. మంగళవారం వెల్దుర్తి లోని ప్రముఖ దేవస్థానం మైసమ్మ గుడి వద్ద వేదిక చేసుకుని కలుసుకున్నారు. 50 సంవత్సరాల తర్వాత విడిపోయి తిరిగి



కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. మళ్లీ కలుస్తామనుకోలేదని భగవంతుడే ఇలా కల్పించారని సంతోషం వ్యక్తం చేశారు. సంవత్సరానికోసారి తప్పకుండా కలుసుకుందామని మిగతా స్నేహితుల అడ్రస్సులు సేకరించి వచ్చే సంవత్సరం అందరం కలుసుకునేలా చర్యలు తీసుకుందామని నిర్ణయించుకున్నారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రమేష్ గుప్తా, సంజీవరెడ్డి, రిటైర్డ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామారావు, రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ సంజీవరెడ్డి, గౌర రెడ్డి, గోపాల్ రెడ్డి, వంజరి రాములు, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# రష్యా బాటలోనే..
# ట్రంప్ యుద్ధం ..!

ఉక్రెయిన్ యుద్ధం ఇంకా ముగియనే లేదు...ట్రంప్ రూపంలో మరో యుద్ధం మొదలయ్యింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడులతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఇది ఇంకా కొనసాగు తుండగానే గాజాపై ఇజ్రాయిల్ దాడులు కూడా ప్రభావం చూపాయి. ఇలా అంతర్జాతీయంగా జరుగుతున్న దాడుల కారణంగా ప్రపంచ మార్కెట్లు కుదుపునకు గురవుతున్నాయి. తాజాగా ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే మరో రకమైన యుద్ధానికి తెరతీసారు. సుంకాలతో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థపై దాడి మొదలు పెట్టారు. ఇది తమకూ వర్తిస్తుందని గుర్తించడం లేదు. అందుకే చైనా ధీటుగానే స్పందిస్తోంది. కొన్ని వస్తువులపై అమెరికాకు పోటీగా సుంకాలు విధించడంతో పాటు, మరికొన్న వస్తువులను అమెరికాకు సరఫరా చేయడం ఆపేసింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడితో ఒక్క ఉక్రెయినే కాకుండా రష్యా కూడా కోలుకోలేని విధంగా దెబ్బతింది. అంతేగాకుండా యుద్ధానికి దిగితే విరమించుకోవడం అంత ఈజీ కాదని తెలిసి వచ్చింది. ఈవ్యవహారం సమసిపోక ముందే ఇప్పుడు ట్రంప్ తీరుతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక విధాలుగా ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. అంతకుమించి అమెరికాలో కూడా ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతు న్నారు. రోడ్డెక్కి ధర్నలు చేస్తున్నారు. ట్రంప్ విధానాలను తూర్పారా బడుతున్నారు. అయినా ట్రంప్‌లో ఏ మాత్రం పశ్చాత్తాపం కనిపించడం లేదు. ప్రపంచ దేశాలు అన్నిటినీ ట్రంప్ వచ్చీరాగానే ఆందోళనలో పడేశాడు. అమెరికాలో చదువుకుంటున్న వారిని, అక్కడికి వెళ్లి ఉంటున్న వారిలో సైతం కంటిమీద కునుకు లేకుండా చేశాడు. ప్రపంచ దేశాల ప్రజలు ట్రంప్ చర్యలు చూసి నవ్వుకుంటున్నారు. సకల దేశాలపై విధించిన సుంకాల వివరాలను ట్రంప్ ప్రకటించారు. కొన్ని దేశాల విషయంలో మాత్రం కొంత ఉదారతను చూపారు. నిరుద్యోగం భారీగా పెరగడం, ద్రవ్యోల్బణం కట్టడి చేయడం లక్ష్యంగా సమస్యలను తొలగిం చేందుకు ట్రంప్ సంకల్పించారు. అమెరికా మహా సంపన్న దేశం. మహాశక్తిమంతమైన దేశం. వైజ్ఞానిక, సాంకేతిక నవకల్పనలు అన్నీ ఆ దేశ ప్రతిభా ఫలాలే. ప్రపంచ అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, ప్రయోగ శాలలు, ఉత్కృష్ట కంపెనీలు అమెరికా లోనే ఉన్నాయి. అమెరికా డాలర్ రిజర్వ్ కరెన్సీగా ప్రపంచ దేశాల ఆమోదం పొందింది. అమెరికా గ్రీన్ కార్డ్, అమెరికా పాస్‌పోర్ట్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందిని ఆకర్శిస్తోంది. ఉద్యోగం దొరికితే చాలు అక్కడే స్థిరపడి పోవాలనుకునే భారతీయులు ఎందరో. చైనా, ఇండియాతో సహా అనేక దేశాలు తమ విదేశ మారక ద్రవ్య నిల్వలలో అత్యధిక భాగాన్ని అమెరికా బాండ్ల రూపంలో భద్రపరచుకుంటున్నాయి. ప్రపంచంలో ద్రవ్యలోటు లేని ఏకైక దేశం అమెరికాయే గనుక ఆ దేశ బాండ్లు తమకు ఆర్థిక భద్రత సమకూరుస్తాయని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. దురదృష్ట వశాత్తు తమకు ఎలాంటి లబ్ధిని సమకూర్చడం లేదని ట్రంప్‌ను గెలిపించిన అమెరికా ప్రజలు భావిస్తున్నారు. ఆయన ఏ ఉద్దేశ్యంతో ఈ సుంకాల యుద్ధం మొదలు పెట్టారో కానీ...అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి గెలిచిన తరువాత డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు, చర్యలు సంచలనం కలిగిస్తున్నాయి. వాటి పర్యవసానాలు సుదీర్ఘకాలం ప్రపంచాన్ని, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయనున్నాయి. దేశదేశాల నుంచి ప్రతిభావంతుల వలసలు అమెరికాకు నిలిచిపోతాయన్న ఆందోళనలను ట్రంప్ పట్టించుకోవడం లేదు. సరుకుల వాణిజ్యానికి గణనీయమైన విఘాతం కలుగుతుంది. సరఫరా చైన్ ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది. ట్రంప్ విధానాల పర్యవసానాలను ఎదుర్కోవడంలో చాలా సంపన్న దేశాలు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. ట్రంప్ ఏవో భ్రమలతో దబాయిస్తున్నారని అందరికీ అర్థమవుతుంది. అమెరికాలోకి దిగుమతి అవుతున్న సరుకులపై భారీ సుంకాలతో సంభవించే ధరల పెరుగుదలను అమెరికా ప్రజలు భరించలేరు. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతుంది. లక్షలాది ప్రజలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదమున్నది. ట్రంప్ చర్యల కారణంగా అక్కడ ప్రస్తుతం నిత్యావసర వస్తువులు ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితులను అమెరికా ప్రజలు సహించరు. అమెరికా ఫస్ట్ నినాదాన్ని స్వాగతిస్తూనే ట్రంప్ తీరును ఎండగడుతున్నారు. అమెరికన్లు కూడా ద్రవ్యోల్బణం తాకిడికి తీవ్రంగా గురవుతారు. ఇప్పటికే అమెరికా వ్యాప్తంగా అన్ని పెద్ద నగరాలలోను వేలాదిగా ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత పెరిగినప్పుడు ఈ ఆందోళనలు మరింత తీవ్రం కాక తప్పవు. అమెరికా ప్రజల ఆగ్రహావేశాలకు ట్రంప్ ఎలా ప్రతిస్పందిస్తారన్నది తెలియాల్సి ఉంది. అనవసరంగా తేనెతుట్టెను కదిపిన ట్రంప్, తనకూ పుతిన్‌కు పెద్దగా తేడా లేదని నిరూపించుకున్నారు. ఆధునిక యుద్ధాలు ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తాయని అనుభవంలోకి వచ్చింది. అమెరికా బాండ్లపై వడ్డీ రేట్ల తీరుతెన్నులను ఆయన తప్పక పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ట్రంప్ సుంకాల దెబ్బను కొన్ని దేశాలు తీవ్రంగానే ప్రతిఘటిస్తున్నాయి. స్పందిస్తున్నాయి. ప్రతీకార సుంకాలను చైనా విధించింది. నీ బెదిరంపులను పట్టుకోబోమని తేల్చింది. కెనడా, యూరోప్ గట్టిగా ప్రతిఘటిస్తున్నాయి. సుంకాల సమరాన్ని అమెరికా అనివార్యం చేస్తే, చైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. రాజీ లేని పోరుకు బీజింగ్ సమాయత్తమై ఉన్నది. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధంపై భారత్ ఆచితూచి అడుగేస్తోంది. మోదీ ప్రభుత్వం ఈ విషయమై జాగరూకతతో వ్యవహరించడం కూడా ముఖ్యమే. ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో అందరూ సంతోషిస్తున్నారు. ఈ యుద్ధ విరామంతో, ఆయనను ఆర్థిక వివేకం కలిగి ఆలోచన చేస్తే ఆయనతో పాటు..ప్రపంచ దేశాలకు కూడా మంచిదే. కానీ ఇలాగే సుంకాల యుద్ధం కొనసాగిస్తే...దానికి ఫలితం కూడా అనుభవించక తప్పదు. ట్రంప్ విధానాలతో ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెడుతోందని ఆర్థికవేత్తలు చాలా మంది గట్టిగా అభిప్రాయపడుతున్నారు. ఆర్థిక మాంద్యం ముంచుకు వస్తోందని కూడా పలువురు ఘంటాపథంగా చెబుతున్నారు.

# సన్న బియ్యం పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుంది

: నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి



వెల్దుర్తి ఏప్రిల్ 15, సమయం న్యూస్ : పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. వెల్దుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడిపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్యటించారు. గ్రామానికి చెందిన గిరికెల మల్లేశం, మహేశ్వరి దంపతుల నివాసంలో సన్న బియ్యంతో తయారుచేసిన భోజనం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలే కాకుండా, కొత్త పథకాలను అమలు చేసి నిరుపేదలకు అండగా నిలుస్తుంది అన్నారు. 6 గ్యారంటీ పథకాలు అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగ నిలుస్తుందని తెలిపారు. సన్న బియ్యంతో నిరుపేదలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, జిల్లా గ్రంధాలయ బోర్డ్ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మహేష్ రెడ్డి, మండల మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, రాష్ట్ర ఫిషర్మెన్ కార్యదర్శి తలారి మల్లేష్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కొత్త ముక్తా బాయ్, పట్టణ అధ్యక్షుడు మల్లేశం చారి, బత్తుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఓరుగల్లు రజతోత్సహ సభ కాంగ్రెస్ దుష్ట పాలనపై యుద్ధభేరి

* పల్లెలన్నీ వరంగల్ బాటపట్టాలి
* బీఆర్ఎస్ రజతోత్సహ సభ సన్నాహక సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి




బాన్సువాడ ఏప్రిల్ 15( సమయం న్యూస్) : మాజీమంత్రి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి నమ్మక ద్రోహి, వెన్నుపోటు దారుడు అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి మండిపడ్డారు. బాన్సువాడలోని భారత్ గార్డెన్స్ లో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ వరంగల్ రజతోత్సహ సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ పాలిట కేసీఆర్ దేవుడు. బాన్సువాడ పాలిట పోచారం బకాసురుడు. ప్రజల పాలిట నరకాసురుడు అని నిప్పులు చెరిగారు. పోచారం శ్రీనివాసరెడ్డిని తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్మీ పుత్రుడు అని ప్రేమగా పిలిచే వారన్నారు. అయితే ఆయన లక్ష్మీ పుత్రుడు కాదని, శని పుత్రుడు అని జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ పోచారం శ్రీనివాసరెడ్డిని ఎంతో గౌరవించారని, తెలంగాణ తొలి మంత్రివర్గంలో ఆయనకు సముచిత స్థానం కల్పించారని, రెండో సారి అధికారం చేపట్టిన తరువాత అసెంబ్లీ స్పీకర్ గా అవకాశం ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. బాన్సువాడ నియోజకవర్గం కోసం పోచారం శ్రీనివాసరెడ్డి ఏది అడిగినా కాదనకుండా ఇచ్చారన్నారు. ఇక్కడ కట్టించిన పదివేల ఇండ్లు కేసీఆర్ దయ అని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ ను అడిగి ప్రతిరోజు ఏదో ఒక జీవో తీసుకున్న పోచారం పార్టీ ఆపదలో ఉన్న సమయంలో కాంగ్రెస్ లో చేరి తీరని ద్రోహం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పోచారం బాన్సువాడ సౌభాగ్యం కాదని ఇక్కడి ప్రజల దౌర్భాగ్యమని, తడిగుడ్డతో గొంతు కోసే రాక్షసుడని, నమ్మినోళ్ళను నట్టేట్లో ముంచే నమ్మక ద్రోహి, అన్నం పెట్టిన చేతికే సున్నం పెట్టే వంచకుడు అని ఆయన ఆరోపించారు. తిన్నింటి వాసాలు లెక్కబెట్టే పోచారం లాంటి విశ్వాస ఘాతకులను ప్రజలు క్షమించరన్నారు. క్రషర్లు, ఇసుక దందాలకు కక్కుర్తి పడి పార్టీ మారిన పోచారం తల్లి పాలు తాగి తల్లి రొమ్ముపైనే తన్నిన నీచుడని, పోచారం తరచూ పార్టీలు మార్చే ఊసరవెల్లి అని, ఆయన పులి కాదని, తిన మరిగిన గండుపిల్లి అని జీవన్ రెడ్డి దుయ్యబట్టారు. పసుపు జెండా ఇంట్లో పెట్టి గులాబీ జెండా పట్టిండు. ఇప్పుడు గులాబీ జెండా వదిలి మూడు రంగుల జెండా పట్టిండు. జెండాలెన్ని మార్చినా అవినీతే పోచారం అసలు ఎజెండా అని ఆయన ఆరోపించారు.

* త్వరలోనే బాన్సువాడ ఉప ఎన్నిక

త్వరలోనే బాన్సువాడ కు ఉప ఎన్నిక రావడం ఖాయమ న్నారు. పోచారం ఘోరంగా ఓడడం, డిపాజిట్లు కూడా గల్లంతు కావడం, ఊసరవెల్లి రాజకీయాలలో ఆరితేరిన పోచారాన్ని బాన్సువాడ ప్రజలు పంచె ఊడిపోయేలా ఉరికించి కొట్టడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు.

* కేసీఆర్ తెలంగాణ ఆస్తి

తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అంటే తెలంగాణ ఆస్తి అని, ఆయన సకల కులాలు, సకల మతాల బంధువు అని జీవన్ రెడ్డి అభివర్ణించారు. కేసీఆర్ ది తెలంగాణ హక్కుల కోసం పోరాడే ఉక్కు సంకల్పమన్నారు. కేసీఆర్ తెలంగాణ రక్షణకు దేవుడిచ్చిన వరం అని, తెలంగాణ ద్రోహుల ను ఎండగట్టే ధిక్కార స్వరమని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ మాట గులాబీ సైన్యం కదం తొక్కే బాట కావాలన్నారు. పల్లెలన్నీ ఓరుగల్లు బాటపట్టాలి. వరంగల్ లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ చాలా ముఖ్యమైన దన్నారు. బీఆర్ఎస్ రజతోత్సహం చారిత్రిక ఘట్టమన్నారు. చీకట్లు ఆవరించిన ప్రతీసారి ఆ చీకట్లను చీల్చుకుంటూ వెలుగులోకి వచ్చిన ధీర చరిత్ర బీఆర్ఎస్ ది. వరంగల్ బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభ తెలంగాణ ద్రోహులపై పూరించనున్న యుద్ధ భేరి. ఆపద సమయంలో గులాబీ సైన్యం మరింత కఠోరంగా పని చేసే కేసీఆర్ కి కొండంత అండగా నిలవాలి. 27వ తేదీన పల్లెలన్నీ ఓరుగల్లు బాటపట్టాలి అని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. కేసీఆర్ పదేళ్ల పాలన స్వర్ణ యుగం.. కాంగ్రెస్ రాకతో మళ్లీ రాతి యుగం .. కేసీఆర్ పదేళ్ల పాలన స్వర్ణ యుగమని, కాంగ్రెస్ పదహారు నెలల పాలన రాతియుగాన్ని గుర్తుకు తెస్తున్నదని ఆయన అన్నారు. కేసీఆర్ పాలన దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. కేసీఆర్ చావు నోట్లో తల పెట్టి సాధించిన తెలంగాణ నేడు గుంటనక్కల పాలైందని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గుంట నక్కల పాలన వల్ల తెలంగాణ పరువు పోతున్న దన్నారు. బీఆర్ఎస్ ను ప్రజలు కావాలని ఓడించలేదని, కాంగ్రెస్ కుట్ర చేసి అబద్దాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఒక్క గ్యారెంటీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో హామీ ఇవ్వకపోయినా ఎన్నో పథకాలు అమలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రుణమాఫీ, రైతు భరోసా, కల్యాణ లక్ష్మి, కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టులు, 24గంటల కరెంట్, ఇంటింటికి మిషన్ భగీరథ మంచినీళ్లు, మెరుగైన వైద్యం, సర్కారు విద్యా సంస్థలలో సౌకర్యాలు, ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో ఉద్యోగ అవకాశాలు, పెన్షన్లు మళ్లీ రావాలంటే కేసీఆర్ మళ్లీ రావాల్సిందేనని అన్నివర్గాల ప్రజలు తీర్మానించుకున్నారని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## తూర్పు జర్నలిస్టులు చేపట్టిన నిరాహార దీక్షలకు
# వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా సంపూర్ణ మద్దతు



వరంగల్ ఏప్రిల్ 15 : తూర్పు జర్నలిస్టులు చేపట్టిన నిరాహార దీక్షలకు వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా సంపూర్ణ మద్దతు ప్రకటించింది.రాష్ట్ర ఉపాధ్యక్షులు తాడూరి కర్ణాకర్,కార్యదర్శి ప్రమోద్ కుమార్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ పులి శరత్ కుమార్ జాతీయ నాయకులు యాంసాని శ్రీనివాస్, జిల్లా నాయకులు కొత్తపల్లి రమేష్, రడపాక ప్రదీప్ దీక్ష శిబిరాన్ని సందర్శించి దీక్షలో కూర్చున్న జర్నలిస్టులకు పూలమాలలు వేసి మద్దతు ప్రకటించారు.అనంతరం మాట్లాడుతూ ఎంతో కాలంగా రెండు పడక గదుల ఇళ్ల కోసం ఎదురు చూసిన జర్నలిస్టులకు నిరాశే మిగిలింది.అసెంబ్లీ ఎన్నికలకు ముందే తూర్పు పరిధిలోని అర్హులందరికీ కేటాయిస్తున్నట్లు బిల్డప్ ఇచ్చి తర్వాత తుస్సుమనిపించారు. అప్పటి మంత్రి కేటీఆర్ తో ప్రారంభోత్సవం చేయించడంతో పాటు కొందరికి ఇళ్లను కేటాయించిన అధికారులు,నాయకులు ఆ తర్వాత చేతులెత్తేశారు.అయితే నాయకుల మెప్పుకోసం ఇళ్ల కేటాయింపులో జాప్యం తగదంటూ సూచించారు.జర్నలిస్టులు చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా నిలిచారు.పాత్రికేయులతోపాటు వారు కూడా కొద్ది సేపు దీక్షలో పాల్గొన్నారు. తూర్పు జర్నలిస్టులకు వెంటనే డబుల్ బెడ్ రూంలు కేటాయించాలని కోరారు. అయితే నిర్వహణ లేకపో వడంతో రెండు పడక గదుల ఇండ్లు పోకిరీలు, మందుబాబులకు అడ్డాగా మారాయి. అందులో ఉన్న ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో పాటు కిటికీలు,తలుపులు ఎత్తుకుపోతున్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ తో ఎన్నో సంవత్సరాల కాలంగా పోరాటం చేస్తున్న వరంగల్ తూర్పు జర్నలిస్టులకు దేశాయిపేట డబుల్ బెడ్ గృహాలు కేటాయించాలన్న న్యాయమైన డిమాండ్ నెరవేరెందుకు వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా సహకారం అందజేస్తుందని చెప్పారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం జర్నలిస్టులకు తక్షణమే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, ఎల్లప్పుడూ జర్నలిస్టులను కంటికి రెప్పలా కాపాడుకోవడమే కాకుండా ఎక్కడి వరకు అయినా వెళ్లి కొట్లాడడానికి సిద్ధంగా ఉన్నామని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు తాడూరు కరుణాకర్ అన్నారు.వరంగల్ తూర్పు నియోజకవర్గం వర్కింగ్ జర్నలిస్టుల నిరాహార దీక్ష రెండో రోజు వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా నాయకులు మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు తాడూరి కరుణాకర్ మాట్లాడుతూ పార్టీలు మారిన,పాలకులు మారిన, మారని జర్నలిస్టుల పరిస్థితి.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన యొక్క నిధులు,కేంద్ర నిధులతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కట్టించి మేము కట్టించామని గొప్పగా చెప్పుకుంటున్నారు,కేంద్ర ప్రభుత్వ నిధులను ఈ రకంగా నిర్లక్ష్యం చేయడం సరికాదు.బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంతో గొప్పలు చెప్పిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో జర్నలిస్టులకు కేటాయించినట్టు గొప్పగా చెప్పిన అప్పటి ఎమ్మెల్యే నరేందర్ పనితీరు విషయంలో శూన్యం.ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే మంత్రి హోదాలో ఉండి జర్నలిస్టులను చిన్నచూపు చూస్తూ వారికి కేటాయించకపోగా వారు చేస్తున్న నిరాహార దీక్షపై ఎటువంటి స్పందన లేకపోవడం వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలు తలదించుకునే విషయం.అప్పటి టిఆర్ఎస్ ఇప్పటి కాంగ్రెస్ స్వార్థపూరిత రాజకీయాల వలన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇండ్లు ప్రస్తుతం మరమ్మతులు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు తాడురి కరుణాకర్, కార్యదర్శి ప్రమోద్ కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ పులి శరత్ కుమార్,జిల్లా నాయకులు కొత్తపల్లి రమేష్, రడపాక ప్రదీప్ సీనియర్ పాత్రికేయులు జక్కు విజయ్ సూర్య ప్రకాశ్ ఈనాడు చిన్న బాబు సాక్షి టి నరేష్ సోటాల హరి టి వీ 9 పెరుమాళ్ళ మధు టీవీ 5 బండి రవి అజయ్ ఫోటో జర్నలిస్ట్ లు దాసరి శ్రీనివాస్ మాషుక్ ఇంద్ర రెడ్డి శ్రీహరి కమాటం వేణు జన్ను శ్యామ్ అశోక్ శంకర్ బండ్ల కరుణాకర్ తదితర నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

# మహనీయుల బాటలో నడుద్దాం



*** సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కె రాజయ్య**

జిన్నారం, ఏప్రిల్ 15 (సమయం న్యూస్): మహనీయుల బాటలో మనమంతా నడుద్దామని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని టీఐడీసీ పరిశ్రమ కార్మికులతో కలిసి మహనీయుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిశ్రమ కార్మికులతో కలిసి మహనీయుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజయ్య మాట్లాడుతూ మహనీయుల ఆశయాలకు ప్రస్తుత రాజకీయ పార్టీలు విరుద్ధంగా పని చేస్తున్నాయని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ లు చెప్పేది ఒకటి చేసేది మరొకటి అని ఆయన అన్నారు. కుల వివక్ష పట్ల ఆర్ఎస్ఎస్ తన వైఖరిని స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిటి రణదీవ్, జ్యోతిరావు బాపులే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లు సమ సమాజం కోసం పాటుపడ్డారని కార్మికులంతా ఐక్యంగా పోరాడి సోషలిజం సాధించుకోవాలని చెప్పారు . జ్యోతిరావు పూలే సమానత్వం కోసం పోరాడ డని ,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కుల వ్యవస్థ పై పోరాడని ఆయన గుర్తు చేశారు .మహనీయుల ఆశయాలు ఈరోజు వరకు కూడా నెరవేరలేదని ఆయన విమర్శించారు. నేటి పాలకులు జయంతులు, వర్ధంతుల రోజు మాత్రమే గుర్తు చేసుకుంటారని తర్వాత మర్చిపోతారని ఆయన తెలిపారు. మహాత్ములు చూపిన బాటకై మనమందరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్, సత్తయ్య, సుధాకర్ గౌడ్ భద్రం, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వాడకంలో లేని మినీ ట్యాంకులను పట్టించుకోని అధికారులు



శివ్వంపేట ఏప్రిల్ 15 (సమయం న్యూస్) : మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని వివిధ విధుల్లో నిర్మించిన మినీ ట్యాంకులు ఉన్న వాడకంలో లేకపోవడం తో స్థానికులు మంచినీరు సరఫరా నిలిచిపోయినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రానున్న వేసవి కాలంలో నీటి కొరత తీవ్రమవుతుందనీ "ఈ మినీ ట్యాంకులు మరమ్మతులు చేసి వాడకంలోకి తీసుకురావాలని అధికారులను కోరుతున్నాం," అని స్థానిక గ్రామస్తులు తెలిపారు. "రెండు, మూడు రోజుల పాటు మంచినీరు సరఫరా నిలిచిపోయినప్పుడు ఈ ట్యాంకులు ఎంతో ఉపయోగపడతాయి. వేసవి కాలంలో నీటి కొరతను అధిగమించడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయి." ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను గ్రామ ప్రజలు కోరారు . మినీ ట్యాంకులను వాడకంలోకి తీసుకురావడం ద్వారా స్థానికులకు తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది అని గ్రామస్తులు స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టం ప్రకారమే భూబదలాయింపులు చేపట్టాలి

*** జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్ ఏప్రిల్ 15(సమయం న్యూస్) : జిల్లాలో అభివృద్ధి పనుల నిర్వహణలో అటవీ భూముల వినియోగానికి సంబంధించి ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టం మేరకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫారెస్ట్ కన్జర్వేషన్ చట్టంపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ, అటవీ భూములపై చేపట్టే అభివృద్ధి పనులకు పరివేశ్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా స్థాయిలోనే మంజూరు చేసి, అభివృద్ధి కార్యక్రమాలు ఆపకుండా కొనసాగేలా చూడాలని అటవీ అధికారులకు సూచించారు. అటవీ భూముల్లో రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ప్రాజెక్టులు, పంచాయతీ భవనాలు తదితర నిర్మాణాల కోసం తప్పనిసరిగా పరివేశ్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని తెలిపారు. ఒకవేళ ప్రతిపాదిత ప్రాజెక్టు టైగర్ రిజర్వ్ జోన్‌లో ఉంటే కేంద్ర, రాష్ట్ర వైల్డ్ లైఫ్ అధికారుల అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయడానికి అటవీ శాఖ రెవెన్యూ, విద్యుత్, ఇంజనీరింగ్ శాఖలతో సమన్వయంగా పని చేయాలన్నారు. అనంతరం పరివేశ్ పోర్టల్ గురించి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఎఫ్ఓ నాగినిబాను, ఆర్డీఓలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



# భూ భారతిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

*** కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్, ఏప్రిల్ 15, సమయం న్యూస్ : భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం రూపొందించిన భూభారతి చట్టంపై సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళ వారం భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందించిందని అన్నారు. భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. 17వ తేదీ నుంచి ప్రతి మండలంలో భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ...

## పునరావాస కేంద్రం పనులు

# క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమీక్షించిన కలెక్టర్

*** ఎండ తీవ్రత లో సుమారు మూడు గంటల పాటు కాలి నడకన అధికారులతో పునరావాస కాలనీ లో పనుల ప్రగతి పరిశీలన**

*** పునరావాస కేంద్రం లో పనులు వేగవంతం చేయాలి:జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**



మహబూబ్ నగర్ ఏప్రిల్ 15( సమయం న్యూస్) : ఉదండ పూర్ రిజర్వాయర్ నిర్మాణం లో ముంపునకు గురైన నిర్వాసితులకు పునరావాస కేంద్రంలో మౌలిక సదుపాయాల పనులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మంగళ వారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.గ్రామాల వారీగా పునరావాస కేంద్రం లో మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జడ్చర్ల మండలం దేవుని గుట్ట తండా వద్ద రేగడి పట్టి తండా,చిన్న గుట్ట తండా ,వల్లూరు, ,ఉదండ పూర్,తుమ్మల కుంట తండా,ఒంటి గుడిసె తండా ముంపు గ్రామాల నిర్వాసితులకు లోకేషన్ 1,2 ప్రాంతాల్లో చేపట్టిన పనులను రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,అర్.డి.ఓ,ఇంజినీరింగ్ అధికారులు,కాంట్రాక్టర్ లతో కలిసి సుమారు మూడు గంటల పాటు కాలినడకన ఎండ తీవ్రత ను లెక్క చేయకుండా పునరావాస కేంద్రం లో కలెక్టర్ స్వయంగా పనుల ప్రగతిని పరిశీలించి సమీక్షించారు.పునరావాస కేంద్రం లోకేషన్ 1 లో రేగడి పట్టి తండా,చిన్న గుట్ట తండా ముంపు గ్రామాల నిర్వాసితులకు 151 ప్లాట్ లలో చేపట్టిన మిషన్ భగీరథ త్రాగు నీరు సరఫరా పైపు లైన్,ట్యాంక్ ల నిర్మాణ పనులు,డ్రైన్స్,విద్యుత్ పనులు పూర్తి చేయడం జరిగినట్లు అధికారులు వివరించారు.ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడి కేంద్రం నిర్మాణం చేయనున్న స్థలం పరిశీలించారు. మిగిలిన పనులు వెంటనే పూర్తి చేసి నిర్వాసితులకు ప్లాట్ లు కేటాయింపు చేయడానికి సిద్ధం చేయాలని అన్నారు. .పునరావాస కేంద్రం లోకేషన్ 2 లో వల్లూరు, ఉదండ పూర్,తుమ్మల కుంట తండా,ఒంటి గుడిసె తండా, శామగడ్డ తండా ముంపు గ్రామాల నిర్వాసితులకు చేపట్టిన పనుల ప్రగతి పరిశీలించారు పనులు పురోగతి లో వాటిని సమీక్షించారు. పనుల ప్రగతి ప్రతి వారం కలెక్టర్ కార్యాలయం లో సంబధిత అధికారులతో నిర్వహించే సమావేశాల్లో సమీక్షించి పనుల ప్రగతి ఎంత వరకు చేశారు.చేయ వలసిన పనులు గురించి క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో అధికారులతో సమీక్షిస్తూ పనుల ప్రగతి లో మందగతి లో ఉంటే అధికారులను మందలించి సూచనలు ఇస్తూ పనులను అత్యంత ప్రాధాన్యత నిచ్చి వేసవి లో పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.నిర్వాసితుల సమస్యలు విని పరిష్కారం చేస్తానని సూచించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,స్పెషల్ కలెక్టర్ మధుసూదన్,అర్.డి. ఓ.నవీన్, ఇరిగేషన్ ఎస్. ఈ.చక్ర ధరం,మిషన్ భగీరథ ఎస్. ఈ.జగన్మోహన్,సర్వే లాండ్ రికార్డ్స్ ఏ.డి.కిషన్ రావు,ఇరిగేషన్ ఈ ఈ లు జె.రమేష్,ఉదయ్ కుమార్, మిషన్ భగీరథ ఇంట్రా ఈ ఈ.పుల్లారావు.,మౌలిక విద్య సదుపాయాల సంస్థ ఈఈ రాం చందర్, తహశీల్దార్ నర్సింగ రావు,డి.ఈ.లు, ఏ.ఈ.లు తదితరులున్నారు




# బోధన్‌లో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అవగాహన

బోధన్ పట్టణం, 15 ఏప్రిల్, సమయం న్యూస్ : అగ్నిమాపక వారోత్సవాల 2025 సందర్భంగా మంగళవారం బోధన్‌లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కేంద్ర ఇంచార్జ్ అధికారి బి. శ్రీనివాస్ నేతృత్వంలో బోధన్ లోని రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, ఆర్టీసీ డిపో పరిసరాల్లో అగ్ని ప్రమాదాల కారణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిషేధిత ప్రాంతాల్లో సిగరెట్లు తాగడం పూర్తిగా మానుకోవాలని, వెల్డింగ్, కటింగ్, సోల్డరింగ్ వంటి పనులు చేయబోతే తప్పనిసరిగా అగ్నిమాపక సిబ్బంది పర్యవేక్షణలో జరగాలని సూచించారు. అగ్నిమాపక పరికరాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని, చమురు లేదా గ్యాస్ లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో బోధన్ రైల్వే స్టేషన్ మేనేజర్ రాములు, ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్, ఫైర్ సిబ్బంది ఎస్. శ్రీనివాస్, ఎన్. ఆనంద్, ఎన్. రాహుల్, మోసిన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కొర్రమీను పెంపకంలో రాష్ట్రానికి జిల్లా ఆదర్శం కావాలి

*** కొర్రమీను చేపల పెంపకం పై అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

భద్రాద్రి కొత్తగూడెం ఏప్రిల్ 15( సమయం న్యూస్) : సిరులు పండించే కొర్రమీను చేపల పెంపకం ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్ లో జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులకు, వ్యవసాయ శాఖ ఏపీఎంలకు కొర్రమీను చేపల పెంపకం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ వ్యవసాయం అన్ని సమయాల్లో కలిసి వస్తుందని గ్యారంటీ లేదు.. ఎందుకంటే వర్షాలు ఎక్కువ పడిన ఇబ్బందే.. తక్కువ పడినా కూడా ఇబ్బందే.. ప్రకృతి సహకరిస్తేనే అధిక దిగుబడిని



పొందగలరు. కానీ, అకాల వర్షాల కారణంగా పంట చేతికి అందకుండా పోతుంది. దీంతోపాటు ఇంట్లో ఉన్న మహిళలు మగవాళ్లు అందరూ మరియు వ్యవసాయ కూలీలు నిరంతరం కష్టపడాల్సి వస్తుంది. కాబట్టి ఒక్కసారి పెట్టుబడితో నిరంతరం ఆదాయం వచ్చే చేపల పెంపకం పైన రైతులు దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ఈ చేపల పెంపకంలో కొర్రమీను మాత్రమే ఎందుకు చెప్తున్నామంటే అది ఎటువంటి వాతావరణం అయినా తట్టుకుని బురదలో అయినా బతికే చేప కాబట్టి అని తెలిపారు. కొర్రమీను చేపల పెంపకం కొరకు ఎక్కువ ప్రదేశం కూడా అవసరం లేదని ఒక పావుగుంట ప్రదేశంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం ఇంకో పావు కుంట ప్రదేశంలో ఫామ్ పౌండ్ నిర్మాణం, సుమారు మూడు లక్షల యాభై వేల రూపాయలతో చేపల పెంపకానికి అవసరమైన అన్ని వాటర్ ట్యాంక్,దానా వంటివి తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఒక్కో చేప పిల్ల ఖరీదు 15 రూపాయలు కాగా 1000 చేపల పిల్లల పెంపకం చేపట్టి అందులో 100 చేప పిల్లలు చనిపోయిన 900 చేప పిల్లలు మీ చేతికి వస్తే కిలో సుమారు 300 రూపాయలకు అమ్మిన 2,70,000 రూపాయలు కేవలం 7 నెలల్లో చేతికి వస్తుందని తెలిపారు. కొర్రమీను చేపల పెంపకం యూనిట్ స్థాపన కొరకు బ్యాంకుల ద్వారా పీఎం ఈ జిపి పథకం ద్వారా 35 శాతం సబ్సిడీ వస్తుందని, చేపల పెంపకానికి కావలసిన ఫామ్ పౌండ్ నిర్మాణం ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా నిర్మించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కొర్రమీను చేపల పెంపకం ద్వారా కేవలం రెండు సంవత్సరాల లోనే పెట్టుబడి వాపసు వస్తుందని లక్షల్లో ఆదాయం చేకూరుతుందని మరి ఇతర పంటల్లోనూ ఇంత ఆదాయం రాదని అందువలన జిల్లాలోని రైతులు మహిళా సమాఖ్య సభ్యులు అధిక సంఖ్యలో కొర్రమీను చేపల పెంపకం చేపట్టాలని సూచించారు. కొర్రమీను చేపల పెంపకంలో నాణ్యమైన దానా వాడాలని, రోజుకు ఐదుసార్లు చేపలకి దాన వేయాలని ఆయన సూచించారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక





## ప్రీతమ్ దేశాయ్ హఠాన్మరణంపై ఎమ్మెల్సీ కవిత పరామర్శ

బోధన్ పట్టణం, 15 ఏప్రిల్ సమయం న్యూస్ : బోధన్ బీఆర్ఎస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ప్రీతమ్ దేశాయ్ గుండెపోటుతో ఇటీవల హఠాన్మరణం చెందారు. ఈ ఘటనపై ఆయన కుటుంబాన్ని మంగళవారం నిజామాబాద్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. బోధన్‌లోని వీఆర్ దేశాయ్ నివాసానికి వెళ్లిన ఆమె, ప్రీతమ్ దేశాయ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులతో మనోభావాలు పంచుకున్నారు. ప్రీతమ్ దేశాయ్ తండ్రి వెంకటేశ్వరరావు దేశాయ్ (ప్రముఖ న్యాయవాది, మాజీ ఏఎంసీ చైర్మన్), తల్లి సునీత దేశాయ్ (మాజీ మున్సిపల్ చైర్ పర్సన్), సోదరుడు శ్రీకాంత్ దేశాయ్ (ప్రముఖ దంత వైద్యులు) సహా కుటుంబ సభ్యులను కవిత పరామర్శించారు. వీరి వెంట మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ తదితర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

* **జిల్లా కలెక్టర్ రాజార్షి షా**

ఆదిలాబాద్ ఏప్రిల్ 15( సమయం న్యూస్) : ప్రభుత్వ మద్దతు ధర తో రైతుల దగ్గర నుంచి జొన్నల కొనుగోలుకు సన్నాహక సమావేశం మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా అనుబంధ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మద్దతు ధర రూ.3771/ క్వింటలో తో జొన్న ల సేకరణ, కొనుగోలు లో ప్రాథమిక వ్యవసాయ సంఘాలు, మార్క్ ఫెడ్, పర్యవేక్షణ అధికారులు జిల్లా మార్కెటింగ్, వ్యవసాయ, సహకార అధికారులు మార్కెట్ కమిటీ సెక్రెటరీ రాష్ట్ర కేంద్ర గిడ్డంగి సంస్థ వారి ఎదుర్కుంటున్న సమస్యలు వాటి పరిష్కారం పై చర్చించడం జరిగింది. పదమూడు (13) కొనుగోలు కేంద్రాలు ఆదిలాబాద్, జైనథ్, బేల, తాంసీ, ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్, ధన్నూర్, సిరికొండ, ఇంద్రవెల్లి, షాంపూర్, హస్నాపూర్, నార్నూర్ గుర్తించి రెండు (2) కొనుగోలు కేంద్రాలు అవి బోథ్ ధన్నూర్ ప్రారంభించడము జరిగింది . జొన్నల కొనుగోలు ఎకరానికి



8.65 క్వింటళ్ళు పరిమితి తో ఆదేశాలు రావడము జరిగిందని దానికి జిల్లా కలెక్టర్ ద్వారా జిల్లా సగటు ప్రకారము ప్రభుత్వానికి 15.00 క్వింటళ్ళు ఎకరానికి జొన్న ల కొనుగోలుకు ఆదేశాలు ప్రకారము కొనుగోలు ప్రభుత్వానికి నివేదిక పంపడము జరిగిందని అని జిల్లా మేనేజర్ మార్క్ ఫెడ్ కలెక్టర్ కు తెలిపారు. సత్వరమే షెడ్ లు లేని మార్కెట్ యార్డ్ లలో అవసరమైన మౌలిక వసతుల కల్పించాలి. జిల్లా లోని వ్యాపారస్తులు కొనుగోలు చేసిన రైతులకు పక్క బిల్ ఇవ్వాలని దానిని రిజిస్టర్ లో అమ్ముతున్న వివరాలను పొందు పర్చాలని దాని వివరాలు మార్కెటింగ్ శాఖ కి ఎప్పటికప్పుడు సమర్పించాలని సూచించడము జరిగింది. సబ్ కలెక్టర్, ఉట్నూర్ రెవెన్యూ డివిజన్, ఆదిలాబాద్ అధికారులు జిల్లా బార్డర్ చెక్ పోస్ట్ లు మార్కెటింగ్ శాఖ, రెవెన్యూ శాఖ , పోలీసు శాఖ ద్వారా విజిలెన్స్ టీమ్ ఏర్పాటు చేసి సరిహద్దు రాష్ట్ర ల నుంచి అక్రమంగా జొన్న సరుకు రాకుండా అరికట్టాలని కలెక్టర్ సూచించదం జరిగింది. జొన్న ల కొనుగోలు లో రైతులకి ఎటువంటి ఇబ్బంది లేకుండా సమన్వయముగా అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసి కొనుగోలు చేపట్టాలని జిల్లాలోని ప్రతి జొన్న రైతుకు మద్దతు ధర పొందే విదముగా చర్యలు తీస్కోవాలని సూచించడము జరిగింది. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ), సబ్ కలెక్టర్, ఉట్నూర్, ఏ.యెస్.పి. ఆదిలాబాద్, ఆర్. డి.ఓ. ఆదిలాబాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి , జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి , జిల్లా డిఎం మార్క్ ఫెడ్ అధికారి , మండల వ్యవసాయ అధికారులు, సెక్రెటరీ పి.ఏ.సి.ఎస్. అధికారులు, సెక్రెటరీ మార్కెట్ కమిటీ, అధికారులు రాష్ట్ర, కేంద్ర గిడ్డంగి అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు

హైదరాబాద్, ఏప్రిల్ 15, సమయం న్యూస్: బోధన్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ తల్లి షాగుప్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హైదరాబాద్‌లోని షకీల్ అమీర్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భనలో పలువురు రాజకీయ నాయకులు కూడా పాల్గొని షకీల్ తల్లి షాగుప్త మృతికి నివాళులు అర్పించారు.

# అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

* **జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.**

**సంగారెడ్డి ఏప్రిల్ 15( సమయం న్యూస్):** అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, మునిసిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, జిల్లా లో వేసవిలో త్రాగునీటి ఇబ్బంది ఎత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ




అర్హతల పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ఈ నెల 18 నుంచి 21 వరకు లబ్ధిదారులను గుర్తించాలన్నారు. స్థానిక ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామా, మండల ప్రత్యేక అధికారుల సమన్వయంతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఇప్పటికే జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేసిన గ్రామాలు కాకుండా జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల గుర్తింపు కావాలని తెలిపారు. ఈనెల 17 నుంచి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న లిస్టును అధికారులకు అందిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న దానిలో అర్హత గల వారిని గుర్తించాలన్నారు. లబ్ధిదారులకు లిస్టును మే 2 తారీఖున డిస్ప్లే చేస్తామన్నారు. నియోజవర్గానికి 3500 ఇండ్లు తోపాటు 20 శాతం అదనంగా జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం కేటాయించిందన్నారు. వేసవిలో తాగునీటి అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పరిషత్ సీఈవో జానకి రెడ్డి , జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, పిడి హౌసింగ్ చలపతిరావు, అడిషనల్ డి ఆర్ డి ఓ బాలరాజు, ఎంపీడీవోలు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆర్మూర్ డివిజన్ లో వీఆర్‌డీసీల దుర్వినియోగం

* **చర్యల కోసం బోధన్ తహసీల్దార్‌కు సిపిఎం వినతి**

బోధన్ పట్టణం, ఏప్రిల్ 15, సమయం న్యూస్ : ఆర్మూర్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న విలేజ్ డెవలప్మెంట్ కమిటీలు (వి డి సి) చట్టబద్ధంగా పని చేయకుండా దౌర్జన్యాలకు పాల్పడుతున్న నేపథ్యంలో, వారిపై కఠిన చర్యలు తీసుకుని అరెస్టు చేయాలంటూ బోధన్ తహసీల్దార్ విట్టల్‌కు సిపిఎం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం బోధన్ ఏరియా కార్యదర్శి జె.శంకర్ గౌడ్ మాట్లాడుతూ, ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలో నివసిస్తున్న కలుగీత వర్గాలపై వీఆర్‌డీసీలు దాడులకు పాల్పడుతూ, కుటుంబాలను గ్రామం నుండి బయటకు పంపే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీరామనవమి రోజున గౌడ మహిళలను గుడి నుండి వెళ్లిపోవాలని చెప్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో చేతి వృత్తిదారుల నుండి డబ్బులు వసూలు చేయడం, వేధింపులకు గురిచేయడం వంటివి జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రజలను ఏకం చేసి కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దాసి గోపి, ప్రభాస్, కాశీనాథ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంపై మండలాల్లో
# అవగాహన సదస్సులను పక్కాగా నిర్వహించాలి

* **కలెక్టరేట్ కార్యాలయంలో ఆర్డీవోలు, తాసిల్దార్లు, సివిల్ సప్లై అధికారులతో భూ భారతి చట్టం, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్షించిన కలెక్టర్**

**మెదక్, ఏప్రిల్ 15 (సమయం న్యూస్) :** భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు భూభారతి చట్టం, జిల్లాలో ధాన్యం కొనుగోలు నిర్వహణ తీరు పై అదనపు కలెక్టర్ నగేష్ ఆర్డీవోలు, తాసిల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి లో.. హక్కుల రికార్డ్ లలో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు గాను ముందుగా భూముల సర్వే, మ్యాప్ తయారీ, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, మొదలగునవి భూ భారతిలో కీలక అంశాలని వెల్లడించారు. ఈ చట్టంపై ప్రతి రోజు రెండు మండలాల చొప్పున ఉదయం, మధ్యాహ్నం సమయంలో ఆరు రోజుల్లో జిల్లాలో గల 12 మండలాల్లో అవగాహన సదస్సులను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆయా సదస్సులలో ప్రజలకు ఈ చట్టంపై నిశితంగా అవగాహన కల్పించాలన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన భూ భారతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, వకీలు, రైతు సంఘాల నాయకులు, సభ్యులను కూడా ఈ సదస్సుల్లో భాగస్వామ్యం చేయాలని, చట్టంలో ఉన్న ప్రాధాన్యత అంశాల వివరాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా కరపత్రంపై ముద్రించాలన్నారు. ఆర్ఓఆర్ తప్పుల సవరణ సెక్షన్ 4, 5, 7 ల గురించి, అలాగే ఏ సమస్యకి ఎలా అప్పీల్ చేసుకోవాలి అనే అంశం మీద క్షుణ్ణంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ సదస్సులో అవగాహన కల్పించాలన్నారు. అలాగే జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. మిగిలిన



కొనుగోలు కేంద్రాలను కూడా త్వరితగతిన ప్రారంభించాలని, కేంద్ర నిర్వాహకులు ప్రతి రోజు కేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. ఐకేపీ, పీఏసీఎస్ ల ఆధ్వర్యంలో ఏర్పాటైన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తైన వెంటనే ఓపీఎంఎస్ లో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలని, తద్వారా సకాలంలో రైతులకు డబ్బులు అందుతాయని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కువ రోజుల వరకు కేంద్రంలోని పెట్టుకోకుండా తేమ శాతం రాగానే కాంటా పూర్తిచేసి, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. నిత్యం అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, పౌరసరఫరాల శాఖ అధికారులు రోజుకు ఐదు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ భుజంగరావు, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, తూప్రాన్ జైచంద్రారెడ్డి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## సన్నబియ్యం లబ్ధిదారుని ఇంట్లో జిల్లా కలెక్టర్ తో కలిసి ఎమ్మెల్యే సహఫంక్తి భోజనం

**గద్వాల్ ఏప్రిల్ 15( సమయం న్యూస్):** పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సంపన్నులతో సమానంగా సన్న బియ్యాన్ని అందజేస్తోందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. మంగళవారం కేటిదొడ్డి మండలం మల్లాపురం గ్రామంలో లబ్ధిదారుడు సురేష్ నాయక్ కుటుంబ సభ్యులతో గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ స్వయంగా సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా



జిల్లా కలెక్టర్ లబ్ధిదారుడి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత గల ప్రతి పేదవాడికి ఆరోగ్యకరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. తద్వారా రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా సన్న బియ్యం అందుతాయని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, సన్న బియ్యం పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమని పేర్కొన్నారు. పేద ప్రజలు ఆకలితో బాధపడకుండా పోషకాహారాన్ని పొందాలన్నదే ఈ పథక ప్రధాన ఉద్దేశమని అన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. సన్నబియ్యం లబ్ధిదారులు మాట్లాడుతూ, తమ ఇంటికి కలెక్టర్, అధికారులు భోజనానికి రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ.20.19 కోట్లు విడుదల

* **రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్ 15 (సమయం న్యూస్) : బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు రూ. 20.19 కోట్ల రూపాయిలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి విడతలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్ మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి లక్ష రూపాయిల చొప్పున రూ. 20.19 కోట్ల రూపాయిలను విడుదల చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. ఆర్ధికంగా



ఎన్ని ఇబ్బందులు ఉన్నాకూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు. ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , గ్రౌండింగ్ అయిన ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని ఇప్పటికి 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. గౌరవ ముఖ్ మంత్రి రేవంత్ రెడ్డిగారు 12 మంది లబ్దిదారులకు మంగళవారం నాడు లాంఛనంగా లక్ష రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమచేస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తైన వెంటనే బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షల రూపాయిలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామని వివరించారు. బేస్‌మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు. కనీసం 400 ఎస్ ఎఫ్ టి కి తగ్గకుండా 600 ఎస్ ఎఫ్‌టీకి మించకుండా లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడం, అధికారులకు , ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.



## డంప్ యార్డ్ మాకొద్దు

* **అధికారులకు వినతి పత్రాలు అందజేసిన ప్రజలు**

గుమ్మడిదల, ఏప్రిల్ 15 (సమయం న్యూస్): డంప్ యార్డ్ మాకొద్దంటూ ప్రజలు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారా నగర్ నల్లవల్లి గ్రామాల మధ్య ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంప్ యార్డ్ ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం గుమ్మడిదల, నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారా నగర్ గ్రామస్తులు తహసిల్దార్ కార్యాలయంలో అధికారులను కలిసి డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా వినతి పత్రాలను అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఈ గ్రామాల ప్రజలు డంప్ యార్డు కు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను తెలియజేశారు. డంపు యార్డుకు వ్యతిరేకంగా ప్రజలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 70వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు కుమార్ గౌడ్, సిజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, మంద భాస్కర్ రెడ్డి నాయకులు, గ్రామల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి పై రైతుల్లో పూర్తి అవగాహన కల్పించండి

* **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్ 15 (సమయం న్యూస్):** భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రైతుల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం కొత్త ఆర్ఓఆర్ చట్టంపై మండల తహసిల్దార్ లతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యా నాయక్, ఆర్డీఓ వాసు చంద్ర లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ఎలాంటి సమస్యలు పరిష్కారం అవుతాయనే విషయం రైతులకు సూచించిలన్నారు. భూ భారతి పోర్టల్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులకు కొత్త చట్టంపై రైతుల్లో ఎలాంటి అభద్రతా భావం కలిగి ఉండకూడదని, భూ భారతి ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయనే అనే నమ్మకం ప్రజల్లో కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వారసత్వ భూ బదలాయింపు, సాదాబైనామ భూముల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రెవిన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి సమస్యలు త్వరిత గతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన, భూ సమస్యలు తేలుకునేందుకు గ్రామాల్లో నిర్వహించే గ్రామ రెవెన్యూ సదస్సులకు హాజరు కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చే భూ సమస్యల అర్జీలను తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అధికారులకు ఏవైనా అనుమానాలు ఉంటే సందేహాలను ఉన్నత అధికారుల




దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ తహసీల్దారులకు సూచించారు. మహిళా సాధికారత కోసం ఇందిరా మహిళా శక్తి పెట్రోల్ బంకు ల నిమిత్తం స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలి కలెక్టర్ తహసీల్దార్లకు సూచించారు. మిగిలిపోయిన తహసీల్దారు కార్యాలయాల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పాహనీ స్కానింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. రేషన్ కార్డులు, వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



## బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించిన పోచారం

బాన్సువాడ(సమయం న్యూస్) ఏప్రిల్ 15 : బాన్సువాడ పట్టణ కేంద్రం లోని 12 వ వార్డులో నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో జరిగిన బోనాల పండుగలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల రాజు . బోనం ఎత్తుకొని అమ్మవారికి బోనం సమర్పించిన పోచారం ఈ సందర్భంగా అమ్మవారి దీవెనలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని,ప్రతి ఒక్కరికి ఆ తల్లి దీవెనలు లభించాలని కోరుకున్న పోచారం ఈ బోనాల పండుగలో బాన్సువాడ పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిల్లాలో ఆహార భద్రత కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు

* **జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**
* **అమలు తీరును వివరించిన తెలంగాణ ఆహార కమిటీ ప్రతినిధులు జిల్లా పర్యటన.**

నల్గొండ ఏప్రిల్ 15( సమయం న్యూస్) : పేద ప్రజలు, విద్యార్థులు, గర్భిణీ స్త్రీలు బాలింతలు, కౌమార బాలికలకు పౌష్టికాహార పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా నల్గొండ జిల్లాలో ఆహార భద్రత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ కు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు శారద, భారతి, జ్యోతిలు మంగళవారం జిల్లా లోని కొండమల్లేపల్లి, దేవరకొండ మండలాలలో జాతీయ ఆహార భద్రత చట్టం 2013 అమలు తీరును వివిధ సంస్థలలో పరిశీలించిన అనంతరం సాయంత్రం జిల్లా కలెక్టర్ ను నల్గొండ లోని కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్, సభ్యులకు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ తో జరిగిన సమీక్ష సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం పట్ల పేద ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, దీనివల్ల వారికి పూర్తిగా ఆహార భద్రత అందుతున్నదని తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్న పిల్లలకు సన్న బియ్యంతో భోజనం,



పప్పు, బాలామృతం, గుడ్డు, పాలతో పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామని, అంతేకాక తృణధాన్యాలతో లడ్డూలను ప్రత్యేకంగా తయారు చేయించి గర్భిణీ స్త్రీలు, కౌమార బాలికలు రక్త హీనతతో బాధపడకుండా పంపిణీ చేస్తున్నామని చెప్పారు .దీంతోపాటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యాన్ని వినియోగిస్తున్నామని, అంతేకాక రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో సైతం సన్నబియ్యంతో వారికి భోజనాన్ని అందిస్తున్నామని ,రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన డైట్ చార్జీల ప్రకారమే భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీంతో పేద ప్రజలు, విద్యార్థులు, గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. నల్గొండ జిల్లా లో ముఖ్యంగా దేవరకొండ ప్రాంతంలో మాత శిశు మరణాల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల వాటిని తగ్గించేందుకుగాను ప్రత్యేక దృష్టిని ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందుకుగాను అక్కడి ప్రజలు మూఢనమ్మకాలను విడనాడి క్రమం తప్పకుండా పౌష్టికాహా రాన్ని తీసుకోవడం, పరీక్షలు చేయించు కోవడం, డాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు గర్భిణీ స్త్రీలను పరీక్షించి ఆరోగ్యంగా ఉండే పిల్లలు పుట్టేందుకు చర్యలు తీసుకోవడం, బిడ్డ పుట్టిన తర్వాత ఎలాంటి అనారోగ్యానికి గురి కాకుండా తీసుకున్న చర్యల వల్ల శిశు మరణాల శాతాన్ని తగ్గించామని, మాతృమరణాలు లేకుండా చేశామని చెప్పారు. అలాగే దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో వంద పడకలు ఉన్నప్పటికీ , ప్రతి రోజు 180 మంది వరకు ఓపి ఉంటుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని 200 పడకల స్థాయి పెంచేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించడం జరిగిందని వెల్లడించారు. అదేవిధంగా ఇటీవలే గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలకు ఉద్దేశించి పోషణ పక్షోత్సవాలలో భాగంగా పౌష్టికాహారం పై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యల వల్ల టీబి కేసులను తగ్గించడంలో పురోగతి ఉందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం పాఠశాల, వసతి గృహాల విద్యార్థులకు పెంచిన డైట్ చార్జీల ప్రకారం మెనూలోని అంశాలకు తగ్గట్టుగానే భోజనం పెడుతున్నామని, పెంచిన డైట్ చార్జీల వల్ల భోజనం నాణ్యత పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆహార కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు శారద, భారతి, జ్యోతిలు మాట్లాడుతూ చౌక ధర దుకాణాలలో ఫిర్యాదులను తెలియజేసేందుకు ఫిర్యాదుల పెట్టను ఏర్పాటు చేయాలని, అలాగే నోడల్ అధికారుల నంబర్లను చౌక ధర దుకాణాలలో ఏర్పాటు చేయాలని, అంగన్వాడీ కేంద్రాలలో పెద్ద సైజు పాల ప్యాకెట్లు ఇస్తున్నారని, దీనివల్ల ఒకరి కోసం పాల ప్యాకెట్లు ఓపెన్ చేయటం వల్ల వృధా అవుతున్నాయని, అలా కాకుండా చిన్న పాల ప్యాకెట్లు సరఫరా చేసే విధంగా ప్రభుత్వానికి లేఖ రాయాలని, ఆస్పత్రులలో సాధారణ ప్రసవాలు పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల ఇన్చార్జి అధికారి హరీష్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్, మైనార్టీ సంక్షేమ అధికారి విష్ణు, దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.



## ఇవిగో కేసీఆర్ ఆనవాళ్లు

* **బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ గారు సస్యశ్యామలంగా తీర్చిదిద్దారని చెప్పడానికి ఇదిగో ఆనవాళ్లు అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బాన్సువాడ నియోజకవర్గ కేంద్రం సమీపంలో మంజీరా నదిపై నిర్మించిన చింతల నాగారం చెక్ డ్యాం ను ఆమె సందర్శించారు. మండు వేసవి లోనూ మత్తడి దుంకుతున్న ఈ చెక్ డ్యాం కేసీఆర్ తెలంగాణ ను పచ్చబడేయడానికి పడ్డ తపనను గుర్తు చేస్తుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో మంజీరా నదిపై ఇలాంటి నాలుగు చెక్ డ్యాంలు నిర్మించి రైతులు వాన కోసం ఎదురు చూడకుండా పంటలు పండించుకునేలా కేసీఆర్ గారు చేశారన్నారు. ఈ ఒక్క చెక్ డ్యాం పై ఆధారపడి 1600 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు.

## వేసవి కాలంలో త్రాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు

* **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
* **త్రాగునీటి సరఫరా పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి, ఏప్రిల్ 15 (సమయం న్యూస్) : వేసవి కాలంలో త్రాగు నీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష వేసవి కాలంలో త్రాగు నీటి సరఫరా పై అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వేసవి కాలంలో ఎక్కడ త్రాగు నీటి సరఫరా కొరత రాకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కడ త్రాగు నీటి కోసం ఇబ్బందులు పడవద్దని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరా తప్పనిసరిగా ఉండాలని, అవసరమైన చోట తాత్కాలిక ప్రత్యామ్నాయ పనులు చేపట్టుటకు ప్రతిపాదనలు సమర్పిస్తే నిధులు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఈఈ మిషన్ భగీరథ గ్రిడ్ పూర్ణ చందర్ రావు, ఇంట్రా



ఈఈ గంగాధర శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రోహిత్ శర్మ బ్యాటింగ్ ఆర్డర్‌లో దిగువన రావాలి: అంజుమ్ చోప్రా

స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఈ ఐపీఎల్ 2025 సీజన్‌లో తేలిపోతున్నాడు. మ్యాచుల్లో వరుసగా విఫలమవుతున్నాడు. ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్కటి కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. 0, 8, 13, 17, 18 ఇవీ ఇప్పటి వరకు హిట్ మ్యాన్ ఈ సీజన్‌లో చేసిన పరుగులు. రోహిత్ శర్మ ఫామ్‌లో లేకపోడం ముంబయి ఇండియన్స్ టీమ్ పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆదివారం దిల్లీ క్యాపిటల్స్‌పై 12 పరుగులతో గెలిచిన ముంబయి ఇండియన్స్ పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో ఉంది. ఇప్పటి వరకు ఆడిన మ్యాచుల్లో నాలుగింట్లో పరాజయం పాలై, రెండింట్లో మాత్రమే విజయం సాధించింది. రోహిత్ శర్మ ఫామ్ లేమిపై ఇండియన్ వుమెన్స్ క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ అంజుమ్ చోప్రా స్పందించారు. 'ఫామ్‌లో లేకపోవడం నేరమేమీ కాదు. కానీ ముంబయి ఇండియన్స్ టాప్‌లో ఉండాలంటే శుభారంభాలు దక్కాలి. రోహిత్ శర్మ ప్రస్తుతం ఫామ్‌లో లేడు కాబట్టి... అతడు ఓపెనర్‌గా రాకూడదు.



దిగువన బ్యాటింగ్ చేయాలి. అలాగే జట్టుకు అందుబాటులో ఉన్న అన్ని ఎంపికలను పరిశీలించాలి. మనం ఐపీఎల్ చూసినా... వరల్డ్ కప్ చూసినా... మన ఉత్తమ బ్యాటర్ ఫామ్‌లో ఉండాలని కోరుకుంటాం. కొందరు త్వరగానే గాడిలో పడతారు. ఈ సీజన్‌లో మాత్రం రోహిత్ శర్మకు మంచి ప్రారంభం దక్కలేదు. మనకు అతడు ఎంతటి గొప్ప ఆటగాడో, ఎలాంటి మ్యాచ్ విన్నరో తెలుసు' అని అంజుమ్ చోప్రా అన్నారు.

# చెన్నై జట్టులో 17 ఏళ్ల అయూష్




చెన్నై: చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో రుతురాజ్ గైక్వాడ్ కీలక ఆటగాడు. పైగా కెప్టెన్! గాయంతో అతడు ఈసారి ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. అతడికి ప్రత్యామ్నాయంగా ఆ జట్టు సీనియర్ బ్యాటర్‌ని తీసుకుంటుందని అనుకున్నారు. కానీ అందరి అంచనాలకు భిన్నంగా 17 ఏళ్ల అయూష్ మాత్రే చెన్నై జట్టులో చోటు దక్కించుకున్నాడు. 2024 సీజన్లో విజయ్‌హజారే ట్రోఫీలో ముంబయి తరఫున అరంగేట్రం చేసిన ఈ ఓపెనర్ కర్ణాటకపై తొలి మ్యాచ్‌లోనే 78 పరుగులతో అదరగొట్టాడు. తర్వాత నాగాలాండ్‌పై 181.. సౌరాష్ట్రపై 148 పరుగులు చేసి అందరి దృష్టిలో పడ్డాడు. ఈ ఏడాది జనవరిలో మేఘాలయపై అయూష్ తొలి రంజీ మ్యాచ్ ఆడాడు. కానీ మెగా వేలంలో ఈ కుర్రాడిపై ఏ ఫ్రాంఛైజీ ఆసక్తి చూపించలేదు. రుతురాజ్‌కు గాయం కావడంతో చెన్నై.. అయూష్‌కు అవకాశం ఇచ్చింది. రూ.30 లక్షల కనీస ధరకు దక్కించుకుంది. జంపా స్థానంలో రవిచంద్రన్: గాయపడిన లెగ్‌స్పిన్నర్ ఆడమ్ జంపా స్థానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ రవిచంద్రన్ సమరన్‌ను జట్టులోకి తీసుకుంది. కర్ణాటకకు చెందిన 21 ఏళ్ల రవిచంద్రన్ ఎడమచేతి వాటం బ్యాటర్. అతడిని రూ.30 లక్షల కనీస ధరకు సన్‌రైజర్స్ సొంతం చేసుకుంది. ఇప్పటిదాకా 7 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన రవిచంద్రన్.. 64.50 సగటుతో 516 పరుగులు చేశాడు. ఆరు టీ20 మ్యాచ్‌ల్లో 170 పరుగులు సాధించాడు.

## సినిమా

# ఎన్టీఆర్ ఎందుకు సన్నగా అయ్యారు.. కల్యాణ్ రామ్ ఏమన్నారంటే!



ప్రస్తుతం వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు హీరో కల్యాణ్ రామ్. ఆయన ప్రధానపాత్రలో నటించిన 'అర్జున్ S/o వైజయంతి' ఏప్రిల్ 18న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్టీఆర్ గురించి కల్యాణ్ రామ్ మాట్లాడారు. తారక్ ఎందుకు సన్నగా అయ్యారు మీరేమైనా ట్రైనింగ్ ఇచ్చారా? అనే ప్రశ్నకు సమాధానమిచ్చారు. "ఎన్టీఆర్ ఒక సూపర్ స్టార్. ఆయన మార్కెట్ ఇప్పుడు పాన్ ఇండియా స్థాయికి చేరింది. దేశంలోనే అగ్ర దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో సినిమా చేస్తున్నాడు. వాళ్లిద్దరికీ నేను సలహాలు ఇస్తానా? నేను, తారక్ ఏం చేసినా సినిమా కోసమే" అని చెప్పారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్ 'వార్ 2'లో నటిస్తున్నారు. దీనితో పాటు ఏప్రిల్ 22 నుంచి ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్‌లో జాయిన్ కానున్నారు. ఇటీవల ఆయనకు సంబంధించిన కొన్ని ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. అందులో తారక్ సన్నగా కనిపించారు. ఇక 'అర్జున్ S/o వైజయంతి' విషయానికొస్తే.. ప్రదీప్ చిలుకూరి దీన్ని తెరకెక్కించారు. ఇందులో విజయశాంతి కీలకపాత్రలో కనిపించనున్నారు. తల్లీ కుమారుడి సెంటిమెంట్‌తో ఇది రూపొందింది. ఇటీవల దీని గురించి దర్శకుడు మాట్లాడుతూ.. "కొంత వయసు వచ్చాక అమ్మ తనకు సంబంధించిన విషయాలు మర్చిపోతుంది. ఆ విషయాలు మనం గుర్తుపెట్టుకోవడం ఎంత ముఖ్యమో ఇందులో చూపించాం. అమ్మ పుట్టినరోజు చుట్టూ కథ తిరుగుతుంది" ఇదే పాయింట్‌తో దీన్ని రూపొందించాం అని తెలిపారు.

# పాయల్ మెరుపుల్!



పాయల్ రాజ్ పుత్ కుర్రకారు గుండెల్లో హీటు పుట్టించే ముద్దుగుమ్మ. ఆర్ఎక్స్ 100 టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఈ ముద్దుగుమ్మ.. 2017లో పంజాబీ చిత్రం చన్నా మేరేయాతో సినీ రంగంలో అడుగు పెట్టింది. తన అందం, అభినయంతో వరుసగా సినిమా అవకాశాలను దక్కించుకుంటున్న ఈమె తాజాగా అదిరిపోయే షో చేసింది. 2017లో సినీ రంగంలో అడుగు పెట్టిన ఈ అమ్మడు 2018లో తెలుగు సినీ రంగంలోకి కాలు మోపింది. ఆ తర్వాత ఎన్టీఆర్ కథానాయకుడు, సీత, ఆర్డీఎక్స్ లవ్, వెంకీ మామా, డిస్కో రాజా, అనగనగా ఓ అతిథి, తీస్ మార్ ఖాన్, జిన్నా, మాయా పెటిక, మంగళవారం వంటి చిత్రాల్లో నటించింది. ఈ అమ్మడు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా ఉంటుంది. తన ర్యాంప్ వాక్ కు సంబంధించిన ఫొటోలు వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. పాయల్ రాజ్‌పుత్ ర్యాంప్‌పై అద్భుతంగా కనిపించింది, సొగసైన చోకర్, పోనీటైల్‌తో జత చేసిన రెడ్ కలర్ జంప్‌సూట్ ధరించి, ఆత్మవిశ్వాసంతో అడుగులు వేసింది. ర్యాంప్ పై ఆమె నడకలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# రెట్రో ట్రైలర్ డేట్ ఫిక్స్



కోలీవుడ్ నటుడు సూర్య, పూజా హెగ్డే జంటగా నటిస్తున్న సినిమా రెట్రో. దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు తెరకెక్కిస్తున్న ఈ మూవీ 1980ల కాలాన్ని బ్యాక్‌డ్రాప్‌గా చేసుకొని రూపొందిస్తున్నారు. మాస్ అండ్ క్లాస్ ఎంటర్‌టైనర్ 'రెట్రో' ఒకటి. ఈ సినిమాను స్టోన్ బెంచ్ ఫిలిమ్స్, 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై జ్యోతిక, సూర్య కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వచ్చే నెల 1న తెలుగుతో పాటు తమిళ భాషలో గ్రాండ్ రిలీజ్ చేయనున్నారు. ఇక ఇప్పటికే ఈ మూవీకి సంబంధించిన టీజర్, సాంగ్స్, గ్లింప్స్ విడుదల కాగా ప్రేక్షకుల నుంచి భారీ స్పందన రాబట్టాయి. దీంతో 'రెట్రో' పై ఆడియన్స్ అంచనాలు మరింత పెరిగాయి. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ డేట్ గురించి అధికారికంగా ప్రకటించారు.. అవైటెడ్ ట్రైలర్ ఏప్రిల్ 18న రిలీజ్ అంటు సూర్య ఇంకా పూజ పోస్టర్ తో పోస్ట్ పెట్టారు. అంతే కాదు ట్రైలర్‌తో పాటుగా ఆడియో లాంచ్ కూడా చేస్తున్నట్టుగా మేకర్స్ తెలిపారు. తమిళ నాట గ్రాండ్‌గా ఆడియెన్స్ ఫంక్షన్ చేస్తుండగా అదే రోజున సాయంత్రం ట్రైలర్ రానుంది.



# చిరంజీవి – అనిల్ రావిపూడి సినిమాలో వెంకటేశ్

'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ ఈ ముగ్గుల పండగ బరిలో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు కథానాయకుడు వెంకటేశ్. ఇప్పుడాయన వచ్చే సంక్రాంతికి చిరంజీవితో కలిసి థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరు కథానాయకుడిగా ఓ సినిమా ముస్తాబవుతున్న సంగతి తెలిసిందే. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వినోదంతో పాటు బలమైన భావోద్వేగాలు నిండిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందనుంది. ఇందులో వెంకటేశ్ ఓ ముఖ్య పాత్రధారిగా చిరంజీవితో కలిసి సందడి చేయనున్నారని సమాచారం. దీంట్లో ఆయనది అతిథి పాత్రేం కాదని.. చాలా ప్రాధాన్యమున్న పాత్రని తెలిసింది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా జూన్ నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకునే అవకాశముంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: సమీర్ రెడ్డి.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.